J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74


నెల్లూరు, 07.02.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 36 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com


# రాజధాని.. రాష్ట్రం ఇష్టమే!




రాజధానిని మారిస్తే కేంద్రం చూస్తూ ఊరుకోదని సుజనాచౌదరి... ఢిల్లీలో చక్రం తిప్పుతా... కేంద్రంతో మాట్లాడుతా... రాజధానిని అమరావతిలో వుంచుతా అంటూ చంద్రబాబునాయుడు... అమరావతిని రాజధానిగా కొనసాగించే విషయంలో తెలుగుదేశం వాళ్ళు నమ్ముకుని వున్న చివరి ఆధారం కేంద్ర ప్రభుత్వం. చంద్రబాబు ఏదో చేస్తాడని, వైయస్ జగన్ చేపట్టిన మూడు రాజధానుల విషయంలో విచ్ఛిన్నం చేస్తాడని ఆశపడుతూ వచ్చారు. అయితే ఆ ఆఖరి ఆశలు కూడా గల్లంతయ్యాయి.

- అమరావతిపై తేల్చేసిన కేంద్రం
- దారులు మూసుకుపోయి దిగాలుపడ్డ చంద్రం
- వికేంద్రీకరణకు పెరుగుతున్న మద్దతు

ఈ నెల 4వ తేదీన పార్లమెంటులో మూడో రాజధానుల అంశాన్ని ప్రస్తావించి కేంద్రం నుండి సానుకూల స్పందన రాబట్టి, ఏపిలో వైసిపి ప్రభుత్వానికి ఇబ్బందులు సృష్టించాలని తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్ వేసిన (మిగతా 2వ పేజీలో)



## ప్రజానేత డా. సుందరయ్య కన్నుమూత

2లో

## రెడ్‌క్రాస్..
## ఈ కోట్ల లెక్క తేలాలి!




12లో

# ఆధ్యాత్మిక నగరి... సింహపురి!

- కంచి పీఠాధిపతి రాకతో కళకళలాడుతున్న దేవాలయాలు 2లో


శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో...


శ్రీ ఆములూరమ్మ తల్లి


శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో...






భక్తులకు విన్నపము

సుందరకాండ కథాగాన సప్తాహం
తేది. 16.02.2020 ఆదివారం నుండి
22.02.2020 శనివారం వరకు
ప్రతిరోజూ సాయంత్రం 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
కీ॥శే॥ సుందరదాసు శ్రీ ఎం.ఎస్.రామారావు గారి మనుమడు
డా॥ పి.శ్రీనివాస్ స్వామీజి గారిచే
గానం మరియు వివరణాత్మక వ్యాఖ్యానం
శ్రీ షిరిడి సాయిబాబా కళ్యాణ మందిర ప్రాంగణము,
కొత్తూరు నందు జరుగును.




తేది. 21.02.2020 శుక్రవారం శివరాత్రి సందర్భంగా
ఉదయం 8.00 గం॥ల నుండి మధ్యాహ్నం 12.00 గం॥ల వరకు
రుద్రహోమం

వేకువ ఝామున 1.00 గం॥ల నుండి 5.00 గం॥ల వరకు
శ్రీ శివపార్వతి కళ్యాణము

తేది. 23.02.2020 ఆదివారం
ఉదయం 11.00 గం॥లకు
శ్రీ సీతారామ కళ్యాణం జరుగును.

తేది. 23.02.2020 ఆదివారం మధ్యాహ్నం 12.00 గం॥లకు అన్నదాన కార్యక్రమము జరుగును.


కావున భక్తులందరూ పై కార్యక్రమములందు పాల్గొని స్వామివారి కృపాకటాక్షములు పొందవలసినదిగా కోరుచున్నాము.

కలికి కోదండరామిరెడ్డి - కలికి శ్రీలత
శ్రీ షిరిడి సాయిబాబా రూరల్ వెల్ఫేర్ ట్రస్ట్
కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్.

# ఆధ్యాత్మిక నగరి... సింహపురి!

## కంచి పీఠాధిపతి రాకతో కళకళలాడుతున్న దేవాలయాలు

*కంచికామకోటి పీఠాధిపతి పూజ్యశ్రీ జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్యుల స్వామివారి రాకతో జిల్లా పావనమైంది. శ్రీ స్వామీజీ నెల్లూరుసీమకు విచ్చేసిన సందర్భంగా జిల్లా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. జిల్లాలోని పలు ఆలయాల్లో పెద్దఎత్తున మహా కుంభాభిషేకాలు, విశేషపూజలు జరుగుతున్నాయి. కుంభాభిషేకాలు జరుగుతున్న నగరంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో నెల్లూరు సీమ భక్తిపారవశ్యంతో పులకించిపోతోంది.*



కన్యకాపరమేశ్వరి దేవస్థానం కుంభాభిషేకం సందర్భంగా హెలికాప్టర్ ద్వారా పూలు చల్లుతున్న దృశ్యం

### శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో సర్వాంగ సుందరంగా పునర్నిర్మితమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవం ఈనెల5న ఎంతో వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి స్వహస్తాలతో ఈ కార్యక్రమాలను అద్వితీయంగా నిర్వహించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి, వేలాదిమంది భక్తుల సమక్షంలో అత్యద్భుతంగా నిర్వహించిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు మరెంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమాల్లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, జలవనరుల మంత్రి డా. పి. అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి తదితర ప్రముఖులంతా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేలాదిమంది భక్తులతో ఆలయం నిండిపోయింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా వాసవి అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. 122 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి నూతన ఆలయాన్ని అత్యద్భుతమైన రీతిలో నిర్మించారు. ఈనెల 1 నుంచి 8వ తేది దాకా ఈ మహా కుంభాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలమండలి అధ్యక్షుడు దాసా సురేష్‌రాజా, ముక్కాల ద్వారాకానాథ్ ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు కంచిస్వామిని పరమభక్తితో ఆహ్వానించి కుంభాభిషేకాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ ద్వారా ఆలయానికి పుష్పాభిషేకం చేయడం ప్రజలను, భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 5 నుంచి 7వ తేది వరకు మహా కుంభాభిషేక అష్టబంధన మహోత్సవాలు జరుగుతున్నాయి. 5వతేది నుండి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యురాలు ప్రశాంతిరెడ్డిలు ఉభయకర్తలుగా ఈ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 5న ఆలయ అర్చకుల నేతృత్వంలో జరిగిన కుంభాభిషేక పూజల్లో వీరు పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ ఈనెల 7న ఉదయం 8.40 గంటలకు కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకర విజయేంద్రసరస్వతి శంకరాచార్యుల వారి స్వహస్తాలచే ఎంతో వైభవోపేతంగా మహాకుంభాభిషేక మహోత్సవం జరుగుతుందని, ఈ సందర్భంగా శ్రీచక్ర మహామేరు ప్రతిష్ఠ, శ్రీ గాయత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ఆలయంలో విశేషపూజలు జరుగుతాయని భక్తులందరూ ఈ కార్యక్రమాలకు తరలివచ్చి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాం మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ శంకరాచార్య చంద్రశేఖర సరస్వతిస్వామి వారు ఈ ఆలయానికి తొలుత శంకుస్థాపన చేశారని, ఆ తర్వాత శ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్యులస్వామివారు తొలి కుంభాభిషేకాన్ని నిర్వహించారని, ఇప్పుడు కంచికామకోటి పీఠం పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి స్వహస్తాల మీదుగా ఈనెల 7న మహాకుంభాభిషేకాలు జరుగుతుండడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. కాగా, ఈ కుంభాభిషేకాలను పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం విద్యుత్ శోభలతో దేదీప్యమానంగా ఉంది. ఎంతోమంది ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

### కుంభాభిషేకాలు, విశిష్టపూజలతో.. అలరారుతున్న ఆలయాలు

అదేవిధంగా ఈనెల 11 నుంచి 13 వరకు అల్లూరు మండలంలోని ఇస్కపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలోనూ మహాకుంభాభిషేకాలు, ఈనెల 12 నుంచి 14వతేది వరకు తోటపల్లిగూడూరు మండలంలోని సౌత్ఆములూరు గ్రామంలో ఉన్న ఆములూరమ్మ తల్లి దేవస్థానంలోనూ జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా మహాకుంభాభిషేకాలు జరుగనున్న నేపథ్యంలో భక్తజనుల కోలాహలంతో ఆయా ఆలయాల్లో సందడి నెలకొంది. ఆలయాల్లో విశేష పూజలు జరుగుతున్నాయి. మరోవైపు ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రముఖ దాతలు కలికి కోదండరామరెడ్డి, కలికి శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22తేది వరకు ప్రతి రోజూ సుందరకాండ కథాగాన సప్తాహం జరుగనుంది. కొత్తూరులోని శ్రీ షిరిడి సాయిబాబా కల్యాణమండపంలో అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమంలో పూజ్య గురుదేవులు.. హనుమదుపాసకులు డా.పి.శ్రీనివాస స్వామీజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనుంది. ఇంతటి విశేషమైన కార్యక్రమాలతో సింహపురిసీమ ఆధ్యాత్మికసీమగా మారి అందరినీ భక్తిపారవశ్యుల్ని చేస్తోంది.

# రాజధాని.. రాష్ట్రం ఇష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తుగడ ఆ పార్టీకే అడ్డం తిరిగింది. మూడు రాజధానుల అంశంపై కేంద్రం తన వైఖరిని ముఖం మీద గుద్దినట్లు చెప్పింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో అభివృద్ధి కుంటుపడుతుందని, పెట్టుబడులు వెనక్కిపోతున్నాయని, రాజధానికి భూములిచ్చిన రైతులు అన్యాయమైపోతున్నారని, అక్కడ శాంతిభద్రతల సమస్య తీవ్రంగా వుందని తెలుగుదేశం ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నానిలు సభలో ఆక్రోశించారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని, చర్యలు తీసుకుంటామని కేంద్రం ప్రకటించి వుంటే తెలుగుదేశం నాయకులు ఇది తమ విజయంగా డప్పుకొట్టుకునేవాళ్ళు. పచ్చమీడియా ఆ ఇద్దరు ఎంపీలను తెలుగువీరులుగా కీర్తిస్తూ, వీర తిలకాలు దిద్దేది. అలాగే రేపు విజయవాడకు వచ్చినప్పుడు భారీగా స్వాగత సత్కారాలు పలికి వూరేగించి వుండేవాళ్ళు. కేంద్రం నుండి అలాంటి సమాధానమే వస్తుందని వాళ్ళు ఊహించారు.

కాని, రాజధాని అంశంలో కేంద్రం తన వైఖరిని తెగేసి చెప్పింది. పార్లమెంటులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ వ్రాతపూర్వక సమాధానమిస్తూ రాజధాని అంశం పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనిదేనని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పడంతో తెలుగుదేశం నాయకుల ముఖాన నెత్తురు చుక్క లేకుండా పోయింది.

ఒకప్పుడు ప్రపంచ దేశాలన్నీ తిరిగి అంతర్జాతీయ నాయకుడినని తనకు తాను ప్రకటించుకున్న చంద్రబాబునాయుడు, ఆ తర్వాత యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీఏ ప్రభుత్వాలలో చక్రం తిప్పడం ద్వారా జాతీయ నాయకుడి స్థాయికి దిగాడు. 23 జిల్లాల ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి రాష్ట్ర విభజనతో 13 జిల్లాల సీఎం అయ్యాడు. 2019 ఎన్నికల తర్వాత 23 అసెంబ్లీ నియోజకవర్గాల నాయకుడయ్యాడు. ఇప్పుడు మూడు రాజధానుల నిర్ణయంతో జగన్మోహన్‌రెడ్డి ఆయనను మూడు గ్రామాల నాయకుడు స్థాయికి తీసుకొచ్చాడు.

అమరావతినే రాజధానిగా కొనసాగించాలంటూ చంద్రబాబు చేస్తున్న అరుపుల వెనుక ఆయన స్వార్థమే ఎక్కువుగా వుంది. హైదరాబాద్‌లోని మాదాపూర్ తరహాలోనే ఆయన అమరావతి స్కెచ్ గీశాడు. అక్కడ హైటెక్ సిటీలాగానే ఇక్కడ రాజధాని అంశాన్ని లీక్‌చేసి అయినవారందరి చేత అక్కడ భూములు కొనిపించాడు. ప్రజల డబ్బుతో అమరావతిలో అభివృద్ధి పనులు చేపట్టి మాదాపూర్‌లో లాగే ఇక్కడ కూడా తమ భూముల విలువలను పెంచేసుకోవాలని ప్లాన్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి చెందిన నగరం కాబట్టి మాదాపూర్ స్కెచ్ సక్సెస్ అయ్యింది. ఇక్కడ అమరావతి అలా కాదు. అన్నీ సమస్యలే. దానికితోడు చంద్రబాబు నిర్వాకం కూడా! ఈయన ఐదేళ్ల కాలంలో ఒక్కటీ శాశ్వత భవనం కట్టలేదు. అన్నీ తాత్కాలిక భవనాలే. దానికి తగ్గట్లే అమరావతి కూడా తాత్కాలిక రాజధాని అయ్యింది.

మూడు రాజధానుల నిర్ణయాన్ని ఆపడానికి చంద్రబాబు నమ్ముకున్న మార్గాలు మూడే... ఒకటి కోర్టు, రెండు శాసనమండలిలో బిల్లును అడ్డుకోవడం, మూడు కేంద్రం. కోర్టులో ఇప్పటికే పిటిషన్‌లు వేశారు. కాని శాసనసభల విధుల్లోకి కోర్టులు జోక్యం చేసుకోకపోవచ్చు. రాజధాని అంశంపై తాత్కాలికంగా స్టేలు ఇవ్వగలరేగాని శాశ్వతంగా ఆపలేరు. ఇక శాసనమండలిలో వున్న అవకాశం ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపి ఓ మూడు నెలలు ఇవి అమలులోకి రాకుండా వాయిదా వేయించగలిగాడు. ఇక మూడో మార్గం కేంద్రప్రభుత్వం. వాళ్ళు స్పష్టంగా తమ వైఖరి చెప్పేశారు. కాబట్టి మూడు రాజధానుల అంశాన్ని అమలు కాకుండా అడ్డుకోవడం చంద్రబాబు తరం కాదు.

# డా. సుందరయ్య కన్నుమూత

అటు వైద్యుడుగా, ఇటు నాయకుడిగా ప్రజల నాడిని ఒడిసి పట్టి, వారి ఆరోగ్య సమస్యలకే కాదు, వారి జీవిత సమస్యలకూ పరిష్కారాలు చూపిన ఘనాపాటి, నిష్కల్మషమైన రాజకీయాలకు, విలువలతో కూడిన వ్యక్తిత్వానికి నిలువెత్తు రూపం మాజీ శాసనసభ్యులు డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి ఇక లేరు. ఎంతోమంది రోగులను తన హస్తవాసితో నయం చేసిన ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 6వ తేదీ ఉదయం ఆత్మకూరులోని తన నివాసగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 85 సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కుమారులు రవీంద్రనాథ్‌రెడ్డి ఆత్మకూరు మాజీఎంపిపిగా, డాక్టర్‌గాను, రెండో కుమారుడు రాజేంద్రనాథ్‌రెడ్డి వైద్యుడిగాను, మూడో కుమారుడు రాఘవేంద్రరెడ్డి ఎమ్మెల్సీగా, జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా సేవలందించి జిల్లావాసులందరికీ సుపరిచితులయ్యారు! ఆత్మకూరు మండలం బట్టేపాడు సుందరరామిరెడ్డి స్వగ్రామం. ఎంబిబిఎస్ పూర్తి చేసిన అనంతరం ఆత్మకూరులో ప్రజావైద్యశాలను ప్రారంభించిన ఆయన ఆత్మకూరు చుట్టుపక్కల దాదాపు 15 మండలాల ప్రజలకు దేవుడయ్యాడు. 1980వ దశకంలో ఆత్మకూరుకు చుట్టుపక్కల మండలాల ప్రజలకు ఏ నిముషంలో ఆరోగ్యం బాగాలేకపోయినా, ఆపద వచ్చినా సుందరరామిరెడ్డే దిక్కు. తన వైద్యవృత్తిలో కొన్ని లక్షల మంది రోగులకు ఆయన వైద్యసేవలందించి వుంటారు. వైద్యవృత్తిని వ్యాపారంగా కాకుండా, ప్రజలకు సేవచేసే మార్గంగా ఎంచుకున్నారాయన. కాబట్టే ఆత్మకూరు ప్రజలు ఆయనను తమ గుండెల్లో పెట్టుకున్నారు.

యువవైద్యుడిగా వున్నప్పుడే ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్‌పార్టీ, 1978లో జరిగిన ఎన్నికలలో ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థిగా ఆయననే నియమించింది. ఆ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఆయన, తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1983లో ఆత్మకూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి పోటీచేశారు. అయితే ఎన్టీఆర్ ప్రభంజనంలో టిడిపి అభ్యర్థి ఆనం వెంకటరెడ్డి చేతిలో ఓడిపోయాడు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మాత్రం అప్పటి బీజేపీ అభ్యర్థి, ప్రస్తుత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడు పైన, 1989 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కర్నాటి ఆంజనేయరెడ్డి మీద వరుస విజయాలు అందుకోవడమేకాక, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక సంస్థ ఛైర్మెన్‌గా కూడా సేవలందించారు. 1994 ఎన్నికల్లో నాలుగోసారి ఆత్మకూరు అసెంబ్లీ నుండి పోటీచేసి పరాజయం పొందారు. 1999 ఎన్నికల్లో మాత్రం ఆయనకు కాకుండా కాంగ్రెస్ అభ్యర్థిగా బొల్లినేని కృష్ణయ్యను టిక్కెట్ వరించింది. అయినా ఆయన అప్పుడు కూడా కాంగ్రెస్ గెలుపు కోసమే కృషి చేశారు. తిరిగి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ ఆయనకే వచ్చినా, ముక్కోణపు పోటీలో ఓడిపోయారు. ఆత్మకూరు అసెంబ్లీ నుండి ఆరుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయనకు పోటీ చేసే అవకాశమొచ్చింది. ఆ నియోజకవర్గ రాజకీయ చరిత్రలో అదొక ట్రాక్‌రికార్డ్. అయితే మూడుసార్లు ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం రావడం ఇంకా రికార్డు. అన్నింటిని మించి ప్రస్తుత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడును ఎన్నికల్లో ఓడించిన తొలి నాయకుడు సందరరామిరెడ్డి... ఈ విషయాన్ని వెంకయ్యనాయుడే పలు సభలలో స్వయంగా చెప్పారు కూడా!

ఏదేమైనా.. జిల్లా రాజకీయ చరిత్రలో డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డిది ఒక ప్రత్యేక స్థానం. ప్రజల మనసుల్లో కొలువైన స్థానం. ఆదర్శవంతమైన రాజకీయాలకు పెట్టని కోట డాక్టర్ బిఎస్ఆర్. ఆ మానవతా నేత మృతికి సంతాపం ప్రకటిస్తూ.. బొమ్మిరెడ్డి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి సంతాపం

మాజీ శాసనసభ్యులు డా. బి.సుందరరామిరెడ్డి మరణం పట్ల భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుమారుడు బి.రాఘవేంద్రరెడ్డిని ఆయన ఫోనులో పరామర్శించి, వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. డా. సుందరరామిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

శ్రీరస్తు ! శుభమస్తు !! అవిఘ్నమస్తు !!! శ్రీ మాత్రే నమః









# శుభ స్వాగతం



నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం, సౌత్‌ఆములూరు గ్రామంలో
నూతనముగా పునఃనిర్మించిన శ్రీ ఆములూరమ్మ తల్లి దేవస్థానములో
నూతన విగ్రహ ప్రతిష్ఠ మరియు మహా కుంభాభిషేక మహోత్సవాలకు
ఫిబ్రవరి 14వ తేదీ శుక్రవారం, సౌత్‌ఆములూరు గ్రామానికి విచ్చేయుచున్న

## శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు, జగద్గురు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర శంకరాచార్య స్వామి వారికి

## భక్తిపూర్వక స్వాగతం.

**శ్రీ నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచన**

| | | |
|---|---|---|
| తేది 12.2.2020 బుధవారం<br>ఉదయం గం॥ 11.30 ని॥లకు గ్రామోత్సవం | తేది 13.2.2020 గురువారం<br>సాయంత్రం గం॥ 6.00 లకు ప్రధాన కలశ స్థాపన | తేది 14.2.2020 శుక్రవారం<br>ఉదయం గం॥ 9.45 నుండి ప్రతిష్ఠా మహాకుంభాభిషేకం |

అందరూ ఆహ్వానితులే

## 'ప్రభా'తం

# కరోనా కల్లోలం

**భూ**కంపాలు, వరదలు, సునామీలు... ప్రకృతి వైపరీత్యాలు... వీటిని ఆపడం మన తరం కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా సంభవించే ప్రకృతి వైపరీత్యాల ద్వారా వేలాదిమంది మృత్యువాత పడుతుండడం చూస్తూనేవున్నాం.


ప్రకృతి వైపరీత్యాలే కాదు, ప్రతిఏటా ప్రపంచాన్ని ఏదో ఒక కొత్త వైరస్ వణికిస్తూనే వుంది. వేల కిలోల బరువుండే జీవులనే వేటాడుతున్న మనిషిని 'వైరస్' అనే సూక్ష్మజీవి నిలువునా కుప్పకూలుస్తోంది. ప్లేగు వ్యాధి, ఆంత్రాక్స్, ఎబోలా, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ... ఒకటేమిటి, ఎన్నో రకాల వింత వైరస్‌లు ప్రపంచాన్ని ఇప్పటికే అతలాకుతలం చేస్తున్నాయి.

ఆ పరంపరలో పుట్టుకొచ్చిందే కరోనా వైరస్. ఇప్పుడు ప్రపంచ దేశాలు తమ శత్రుదేశాలను చూసి భయపడడం లేదు, కరోనా వైరస్ దెబ్బకు వణికిపోతున్నాయి. ఇది తమ దేశానికి ఎక్కడ సోకుతుందోనని ఆందోళన చెందుతున్నాయి. చైనాలో పుట్టిన ఈ వైరస్ ఇప్పటికే పలు దేశాలకు పాకింది. ఇందులో భారతదేశం కూడా వుండడం ఆందోళన కలిగించే పరిణామం.

చైనాలోని ఉహాన్ నగరం కరోనా వైరస్ పుట్టుకకు కారణం. పాముల ద్వారానే ఈ వైరస్ సోకినట్లు వైద్యనిపుణుల పరిశోధనల్లో తేలింది. ఇంకా లోతుగా విచారణలోకి వెళితే తొలుత సౌదీఅరేబియాలో కరోనా వైరస్‌ను గుర్తించారని, అక్కడున్న చైనా వైద్యులు ఈ వైరస్‌ను గుర్తించి, దీనిని డెవలప్ చేసి శత్రుదేశాల మీదకు ప్రయోగించడం ద్వారా తమ ఆధిపత్యాన్ని చాటుకోవాలనుకున్నారని ఒక వాదన.

ఈ విధమైన ఆరోపణలను కొట్టి పారేయలేం కూడా! కుతంత్రాలకు చైనా దేశం పెట్టింది పేరు. బౌద్ధాన్ని స్థాపించిన గౌతమ బుద్ధుడు భారతీయుడు. ఆయన బౌద్ధాన్ని విస్తరించే క్రమంలో అన్ని దేశాలు తిరుగుతూ చైనాలో గడిపిన రోజుల్లోనే తనువు చాలించాడు. ఆయన నుండి సకల విద్యలు నేర్చుకున్న చైనీయులు, ఆ విద్యలు ఇంకెవరికీ తెలియకూడదన్న విషపు ఆలోచనలతో గౌతమబుద్ధుడు తినే ఆహారంలో విషమిచ్చి చంపారనే ప్రచారం కూడా వుంది. కొన్నేళ్ల క్రితం సూర్య హీరోగా నటించిన 'సెవన్త్ సెన్స్' సినిమాలో కూడా ఈ అనుమానాలకు దోహదం చేసే సన్నివేశాలుంటాయి. చైనాలో భయంకరమైన వైరస్ ప్రబలి ప్రజలు గుట్టలు గుట్టలుగా చనిపోతున్న తరుణంలో భారతదేశం నుండి ధర్మబోధి చైనాకు వెళతాడు. చైనా నుండి ఆ వైరస్ పక్కనేవున్న భారతదేశానికి సులభంగా వ్యాపించే అవకాశముంది. భారత్‌లోకి రాకుండా ఆ వైరస్‌ను ఎలాగైనా అరికట్టాలన్న ఉద్దేశ్యంతో ధర్మబోధి అక్కడకు వెళ్లి, అక్కడ ప్రబలిన వింత వ్యాధులకు మందు కనిపెడతాడు. చైనీయులకు స్వాంతన చేకూరుస్తాడు. అక్కడే తనకు తెలిసిన విద్యలు వారికి నేర్పిస్తాడు. ఆయన తిరిగి తన దేశానికి రావాలనుకున్న తరుణంలో ఆయన ఇంకో దేశానికి వెళితే ఆ విద్యలు అక్కడ కూడా నేర్పుతాడన్న కుతంత్రంతో ఆయన తినే ఆహారంలో విషం కలిపి చంపేస్తారు. ఇది సినిమాలో కథే కావచ్చు. కాని చరిత్రలో జరిగిన వాస్తవం కూడా ఇదేనన్నది చరిత్రకారుల వాదన.

> చైనాలోని ఉహాన్ నగరం కరోనా వైరస్ పుట్టుకకు కారణం. పాముల ద్వారానే ఈ వైరస్ సోకినట్లు వైద్య నిపుణుల పరిశోధనల్లో తేలింది. ఇంకా లోతుగా విచారణలోకి వెళితే తొలుత సౌదీఅరేబియాలో కరోనా వైరస్‌ను గుర్తించారని, అక్కడున్న చైనా వైద్యులు ఈ వైరస్‌ను గుర్తించి, దీనిని డెవలప్ చేసి శత్రుదేశాల మీదకు ప్రయోగించడం ద్వారా తమ ఆధిపత్యాన్ని చాటుకోవాలనుకున్నారని ఒక వాదన.



చైనా శాస్త్రవేత్తలు ఒక వైరస్‌ను సృష్టించి దానిని భారతదేశంలో ప్రయోగించడం వంటి సన్నివేశాలు కూడా ఆ సినిమాలో మనం చూస్తాం. ఆ సినిమాలో చూపిన విధంగానే చైనా కరోనా వైరస్‌ను సృష్టించి తన శత్రుదేశాల మీదకు వదలాలను కుందా? అనే అనుమానాలు బలంగా వున్నాయి. ఇలా చరిత్రలోనే కుతంత్రాలకు పెట్టింది పేరని చైనాకు పేరుంది.

ఇక రెండో కోణంలో చూస్తే వైరస్ ప్రబలడానికి ప్రధాన కారణం చైనీయుల ఆహార విధానం. ఒక మనిషి తిని బ్రతకడానికి ఈ సృష్టిలో ఎన్నో మార్గాలున్నాయి. భూమిని సాగుచేసి పండించే పంటను ఆహారంగా తీసుకోవడం అన్నింటిలోకి ఉత్తమం. కాని, చైనీయులు భూమిని సాగు చేసి పండించడం వల్ల వచ్చే ఆహారాన్ని తినడం కంటే కూడా భూమిపైన తిరిగే సకల జీవరాశులను తినడానికే అమితంగా ఇష్టపడతారు. ఒక్క మనిషిని తప్ప ఈ భూమిపై వాళ్ళు తినని ప్రాణి అంటూ వుండదు. మాంసాహారం వైరస్ అత్యంత వేగంగా ప్రబలడానికి ప్రధాన సాధనం. చైనీయులకు పాములను తినే అలవాటెక్కువ. ఇప్పుడు కరోనా వైరస్ కూడా పాముల ద్వారా ప్రబలడం చూస్తున్నాం. కరోనా వైరస్ వచ్చిన 'ఉహాన్' నగరంలోని మార్కెట్‌లో దాదాపు 200 రకాల జీవుల మాంసం అమ్ముతుంటారు.

పూర్వం షాంపై రాజులు ఎటువంటి కరువు కాటకాల పరిస్థితుల్లో కూడా ఆహారం దొరకక తమ దేశ ప్రజలు చనిపోకూడదన్న ఉద్దేశ్యంతో దొరికిన ప్రతి జీవిని ఆహారంగా తీసుకునే విధానాన్ని తమ వాళ్ళకు నేర్పారు. ఆ విధానమే వాళ్ళకు నిత్య కృత్యమైంది. ఇంత చండాలమైన ఆహారపు విధానం ఇంకే దేశంలోనూ లేదు. అయితే కరోనా వైరస్‌ను ఎదుర్కొనే క్రమంలో ఆ దేశం వారంరోజుల్లో వేయి పడకల ఆసుపత్రిని సిద్ధం చేయడం, ఈ వైరస్‌కు వ్యాక్సిన్ కనిపెట్టే ప్రయత్నంలో నిమగ్నం కావడం అభినందించాలి. ఆహారపు విధానంలో భారతదేశంలో కొనసాగుతున్నది ఉత్తమ విధానం. శాఖాహారానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే దేశాలలో భారత్ మొదటి స్థానంలో వుంటుంది. ప్రకృతి ప్రసాదించిన ఆహారాన్నే భారతీయులు ఎక్కువగా ఇష్టపడుతారు. మనం ఆహార విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం లేదు. కాని ఒక వైరస్ ప్రబలిన తరుణంలో ఎంత వేగంగా స్పందించాలి, ఎలా ఎదుర్కోవాలనే విషయాలలో మాత్రం చైనాను ఆదర్శంగా తీసుకోవాలి.

చైనాను కరోనా వణికిస్తున్న తరుణంలో అన్ని దేశాలు కూడా అప్రమత్తమయ్యాయి. ఉహాన్ నగరంలో చిక్కుకున్న భారతీయులను ప్రత్యేక విమానం పంపించడం ద్వారా క్షేమంగా స్వదేశానికి రప్పించారు. భారత్‌లోనూ కేరళ రాష్ట్రంలో కరోనా కేసులు బయటపడ్డాయి. ఈ వైరస్ కనిపించడంతో కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా ఆసుపత్రులను సిద్ధం చేసింది. కరోనాను ఎదుర్కొనే దిశగా కసరత్తు చేసింది. ప్రకృతి వైపరీత్యాలు లాగానే వైరస్‌లు కూడా ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నాయి. మనిషి తలచుకుంటే ప్రకృతి వైపరీత్యాలను ఆపలేడేమోగాని, వైరస్‌లు ప్రబలకుండా చేయగలడు. అందుకోసం కృషి జరగాల్సి వుంది.

---

### బ్రాహ్మణ విద్యార్థులకు

## 6.38 లక్షల ప్రోత్సాహకాలు

జిల్లాలో వివిధ కోర్సులను అభ్యసిస్తున్న ప్రతిభ కలిగిన 161 మంది బ్రాహ్మణ విద్యార్థులకు పలువురు దాతలు 6.38 లక్షల రూపాయల చెక్కులను ప్రోత్సాహకాలుగా అందజేశారు. నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న టివిఎస్ కల్యాణసదన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 2న జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ, దాతలు అందిస్తున్న ఈ సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని, తద్వారా దాతల ఆశయాలకు సార్థకత చేకూర్చాలని అన్నారు. టివిఎస్ కల్యాణసదన్ వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పిఎస్ఆర్‌కె మూర్తి, ట్రస్ట్ అధ్యక్షుడు డి.ఫణిరత్నం, ట్రస్టీలు డాక్టర్ సర్వేపల్లి పరాశరన్, రాఘవేంద్రరావు, వై.నాగ దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్లకు టీడీపీ పూర్తిగా వ్యతిరేకం

తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్లకు పూర్తిగా వ్యతిరేకమని మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఈనెల 2న ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఇచ్చిన ఎన్‌పీఆర్ జీవో 102ను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై నెట్టడం సిగ్గుచేటన్నారు.



ఎన్ఆర్‌సీపై సమావేశం నిర్వహిస్తున్న తెదేపా నాయకులు

జగన్ ప్రభుత్వం, వైకాపా నాయకులు టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చారని అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొయినుద్దీన్, ఖాజావలి, జెన్ని రమణయ్య, ఖాదర్ బాషా, కిర్మానీ, తదితరులు పాల్గొన్నారు.

---




### టీమిండియాకు అభినందనలు

న్యూజిలాండ్‌తో టి-20 సిరీస్‌ను 5-0 తేడాతో వైట్‌వాష్ చేసిన టీమిండియాకు అభినందనలు. విదేశీ గడ్డపై కూడా మన కుర్రాళ్ళు బాగానే రాణించారు. విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మలతో పాటు కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ వంటి యువ ఆటగాళ్ళు రాణించిన తీరు అద్భుతం. ఇదే ఊపుతో టీమిండియా మరిన్ని విజయాలు అందుకోవాలి.

ఎం.నరేష్, నెల్లూరు.

### దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

ఇటీవలకాలంలో హిందూ సంస్కృతిపై, హిందూ దైవారాధనలపై క్రైస్తవ మత బోధకుల దుష్ప్రచారాలు ఎక్కువయ్యాయి. వీళ్ళ మతం గురించి వీళ్ళు చెప్పుకుంటే మత స్వేచ్ఛ, ఇంకొకరి మనోభావాలను దెబ్బతీస్తే అది నేరమే. ఇలాంటివాళ్ళు ఎక్కడ తారసపడినా వెంటనే అడ్డుకోవాలి. హిందువులు సంఘటితమై అలాంటి వారిపై పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెట్టాలి.

సి.రాజీవి, నెల్లూరు.

### పవన్ నటిస్తే తప్పేంటి?

పవన్‌కళ్యాణ్ స్వతహాగా సినిమా నటుడు. ఆయన రాజకీయాల్లోకి వచ్చాడు. పార్టీ పెట్టాడు, పోటీ చేశాడు, ఓడిపోయాడు. రాజకీయాలలోకి వచ్చినంత మాత్రాన సినిమాల్లో నటించడం మానేయాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రయ్యాక కూడా ఎన్టీఆర్, ఎంజిఆర్‌లు నటించారు. ఇంకెంతోమంది రాజకీయాలలోకి వచ్చిన తర్వాత కూడా సినిమాలు, టీవీషోలలో చేస్తున్నారు. పవన్‌కళ్యాణ్ సినిమాల్లో నటిస్తున్నాడని చెప్పి జెడి లక్ష్మీనారాయణ పార్టీకి రాజీనామా చేయడం వింతగా వుంది.

కె.ఆనంద్‌బాబు, తిరుపతి.

### అంత సంక్షేమం పనికిరాదు

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు మరీ ఎక్కువవుతున్నాయి. సంక్షేమ పథకాలు అవసరమైనంత వరకే వుండాలి. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేలా ఈ పథకాలుండాలి. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చిన డబ్బులు ఎక్కువగా మద్యం షాపులకే వెళ్లాయి. ప్రజలకు విద్య, వైద్యం వరకు ఉచితంగా ఇవ్వండి. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆర్థిక సాయం చేయండి, కులాలు, మతాల వారీగా నగదు ఇచ్చే పథకాలను ఆపి వేయండి. ఇలాంటి పథకాల వల్ల ఓట్లు రాలవు అన్నది గ్రహించండి. రాష్ట్రంలో పరిస్థితులు బాగా వుండి, సకాలంలో వర్షాలు పడి పంటలు పండుతూ అన్ని రకాల వ్యాపారాలు సవ్యంగా జరుగుతుంటే ప్రభుత్వం మీద ఆటోమేటిగ్గా ప్రజల్లో సానుభూతి వుంటుంది. దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి పరిపాలనలో జరిగింది ఇదే! చంద్రబాబు పరిపాలనలో ఏ వర్గం ప్రజలు సంతృప్తిగా లేరు కాబట్టే ఆయన సంక్షేమ పథకాల పేరుతో వేలకోట్లు వెదజల్లినా ఓట్లు వేయలేదు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ విషయాన్ని గుర్తించాలి.

చిల్లా కిషోర్, రాపూరు.

## ఉన్నది తాగడమా...?

# లేకుంటే మానడమా?




### మద్యం బాబుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు...

1994లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు పూర్తిగా మద్యపాన నిషేధం విధించాడు. అప్పట్లో ఇక మద్యం షాపులన్నవి వుండేవి కాదు కాబట్టి మందుబాబులకు మద్యం దొరికేది కాదు. తాగేవాళ్ళూ కాదు. తాగాలని నాలుక లాగుతున్నవాళ్ళు మాత్రం పక్క రాష్ట్రాలకు పోయి తాగొచ్చేవాళ్ళు. మందుబాబులకు అదొక గడ్డుకాలం. అప్పట్లో మందు తాగాలన్నా ఉండేది కాదు.

ఇప్పుడు మందుబాబులకు కొత్త కష్టాలొచ్చిపడ్డాయి. తాగాలంటే మందు అయితే దొరుకుతోంది, కాకపోతే కోరుకున్న బ్రాండ్లు దొరకడం లేదు. గత పాతికేళ్లకాలంలో మార్కెట్‌లోకి ఎన్నో కొత్తరకాల మద్యం బ్రాండ్లు వచ్చాయి. ఒక్కొక్కరు ఒక్కో బ్రాండ్‌కు అలవాటైపోయారు. ముఖ్యంగా చంద్రబాబునాయుడు పాలనలో గ్రామగ్రామాన బెల్టుషాపులు పెట్టి అన్నిరకాల బ్రాండ్ల మద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చాడు! చంద్రబాబు మద్యం పాలసీని అంత సులభతరం చేస్తే, ఇప్పుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి దానిని క్లిష్టతరం చేశాడు. రాయల్ ఛాలెంజ్, కింగ్‌ఫిషర్, కరోనా, కాల్స్‌బర్గ్, బడ్వయిజర్ వంటి ఫారిన్ బీర్లు దొరకక మందుబాబుల నోర్లు చప్పబడుతున్నాయి. అదేందో 'బూమ్' బీరంట... దానిని తాగలేక, అటు ఆగలేక... కాషాయం మింగినట్లు మింగుతున్నారు. ఇక విస్కీ, బ్రాందీ, రమ్ వంటి వాటిల్లోనూ మంచిబ్రాండ్లు దొరకడం లేదు. స్థానికంగా దొరికే బ్రాండ్లతోనే సర్దుకుంటున్నారు. ఇక బీర్లు కూలింగ్‌లో దొరకడం లేదు. మందుబాబులకు ఇదొక పెద్ద సమస్యగా వుంది.

అన్నింటికిమించి వైన్‌షాపుల ముందు 'క్యూ'లో నిలబడి మందు సీసాలను కొనాల్సిన రోజులొస్తాయని మద్యం ప్రియులు కలలో కూడా అనుకోలేదు. మొన్నటివరకు 24గంటలు మీ సేవలో అన్నట్లుగా వుండిన మద్యం షాపులు ఇప్పుడు ప్రభుత్వ బ్యాంకుల మాదిరిగా టైంకు తెరవడం, మూయడం చేస్తున్నారు. అసలు మద్యం షాపుల వద్ద 'క్యూ'లో నిల్చున్న మందుబాబులు చెప్పుకునే కష్టాలు వింటుంటే తెలుగు టీవీ సీరియల్స్‌లో మహిళలకు కూడా ఇన్ని కష్టాలు వుండవేమోననిపిస్తోంది.

## నెల్లూరు చెరువు ఆధునీకరణపై

# పార్లమెంటులో ప్రశ్నించిన విపిఆర్



అమృత్ పథకం క్రింద నెల్లూరులోని స్వర్ణాల చెరువు ఆధునీకరణ చేపట్టడం జరిగిందని, ఈ పనులు ఎంతవరకు వాస్తవమో తెలియజేయాలని ఈ నెల 5వ తేదీ రాజ్యసభలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ పని ఎప్పుడు ప్రారంభించబడింది, ఎప్పుడు పూర్తవుతుంది తెలియజేయాలని కూడా ఆయన కోరారు. దీనికి సంబంధిత కేంద్ర మంత్రి సమాధానమిస్తూ... నెల్లూరు చెరువు ఆధునీకరణ పనులు 30కోట్లతో 2018, నవంబర్ 3న ప్రారంభించబడ్డాయని, 2020 జులై నాటికి ఈ పనులు పూర్తిచేస్తామని సమాధానమిచ్చారు. అలాగే ఆయన ఆర్‌ఐఎన్‌ఎల్ స్టీల్ ప్లాంటును విశాఖపట్నంలో ఏర్పాటు చేసే అంశాన్ని కూడా ప్రస్తావించారు.

**బొగ్గు గనుల బిడ్డింగ్‌పై...**

బొగ్గు బిడ్డింగ్ ప్రక్రియలోని సమస్యల గురించి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 2న రాజ్యసభలో ప్రస్తావించారు. మార్కెట్‌లో బొగ్గు ఉత్పత్తిలో భాగంగా బ్యాంకు గ్యారంటీకి సంబంధించి ప్రత్యూష్ సిన్హా కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక గురించి అడిగారు. బొగ్గు వేలం ప్రక్రియను పునరుద్ధరించడం కోసం కమిటీ చేసిన సిఫారసుల వివరాలు, ఆ సిఫార్సులపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు వెల్లడించాలని కోరారు. దీనికి స్పందించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి సమాధానమిస్తూ బొగ్గు గనుల వేలంలో పారదర్శకత కోసం ప్రత్యూష్ సిన్హా అధ్యక్షతన 2017 డిసెంబర్ 18వ తేదీన హైపవర్ ఎక్స్‌పర్ట్ కమిటీని వేయడం జరిగిందని, ఈ కమిటీ సూచనల మేరకు బొగ్గు గనుల వేలం, అమ్మకంలో పలు మార్పులు చేపట్టినట్లు వెల్లడించారు.

అలాగే 4వతేదీ సభలో ఆయన జాతీయ ఆయుష్‌మిషన్ లక్ష్యాలు, అందులోని పథకాలు, ఆంధ్రప్రదేశ్‌లో ఆ మిషన్ యొక్క పరిస్థితి గురించి ప్రశ్నించారు. దీనికి ఆయుష్ మంత్రి శ్రీపాదనాయక్ సమాధానమిస్తూ ఆయుష్ హాస్పిటల్స్, డిస్పెన్సరీలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లు, జిల్లా ఆసుపత్రులతో సమానంగా వైద్యసేవలందించేలా చేయగలిగామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆయుష్ ఆసుపత్రులు, ఆయుర్వేదం, సిద్ధ, యూనాని మరియు హోమియోపతి ఫార్మసీలు, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెకానిజమ్‌లను బలోపేతం చేయడం జరిగిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు 19.01 కోట్లు నేషనల్ ఆయుష్ మిషన్ క్రింద విడుదల చేయడం జరిగిందని మంత్రి తెలిపారు.

# సులభతరంగా డివిజన్‌ల ఏర్పాటు

నెల్లూరు నగరపాలక సంస్థకు త్వరలో ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా నగరంలోని 54 డివిజన్‌ల భౌగోళిక స్వరూపాన్ని అధికారులు సులభతరంగా చేసినట్లు తెలుస్తోంది. గతంలో డివిజన్‌ల పరిధి గందరగోళంగా వుండేది. ఒక ప్రాంతానికి డివిజన్ నెంబరేమో ఒకటుండేది, అందులో నివసించే జనాలకు మాత్రం ఇంకో డివిజన్‌లో ఓట్లుండేవి. ఎన్నికల సమయంలో తమకు ఏ డివిజన్‌లో ఓటుందో తెలియక... పోలింగ్ బూత్ ఎక్కడో అర్థంకాక ఓటర్లు గందరగోళానికి గురైన సందర్భాలున్నాయి.

కాని, ఈసారి డివిజన్‌ల ఏర్పాటును అందరికీ అర్థమయ్యేరీతిలో విభజించినట్లు తెలుస్తోంది. మినీబైపాస్‌కు తూర్పువైపు ఒక భాగం, మినీబైపాస్, రైల్వేట్రాక్ మధ్య ఒక భాగం, రైల్వేట్రాక్, ట్రంకురోడ్డుల మధ్య ఒక పార్ట్, ట్రంకురోడ్డుకు పడమరవైపునంతా ఒక పార్టు... ఇలా దీర్ఘచతురస్రాకారంలో నాలుగు భాగాలు చేసి ఓటర్ల సంఖ్యనుబట్టి ఆయా డివిజన్‌లకు భౌగోళిక సరిహద్దులను నిర్ణయించారు.




ప్రథమ వర్ధంతి

మంచి వ్యక్తిత్వం... నలుగురికి మేలు చేయాలనే
మానవత్వం కలిగిన మా ఇంటి దైవం, మా తండ్రిగారైన
శ్రీ కొండూరు వెంకట్రామిరెడ్డి గారు
స్వర్గస్తులై తే.08.02.2020ది నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ పవిత్రమూర్తిని స్మరిస్తూ....

కుమారుడు : కొండూరు శేషారెడ్డి, అడ్వకేట్
కోడలు : కొండూరు ఉషాలక్ష్మి
మనుమడు : చేరుపాటి హర్షవర్ధన్‌రెడ్డి
మనుమరాలు : చేరుపాటి ప్రతిమ
మునిమనుమడు : చేరుపాటి జతిన్ సిద్ధార్ధరెడ్డి
మునిమనుమరాలు : చేరుపాటి సరోజిని

### నారాయణలో
## ప్రభంజన్ 2020 ఫెస్ట్



నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15న "ప్రభంజన్–2020 జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్"ను నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ఏవిఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను 3వ తేదీ విడుదల చేశారు. ఈ ఫెస్ట్‌ను ఆరు ఈవెంట్స్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాస్ స్టాక్ ఎక్సేంజ్, యంగ్ మేనేజర్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, బెస్ట్ బిజినెస్ ఐడియా, యాడ్ జాబ్, బిజినెస్ క్విజ్‌లను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఈవెంట్‌లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విజేతలకు 5వేలు, 3వేలు, 2వేలు లెక్కన నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేయడం జరుగుతుందని వెల్లడించారు.

ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ అడ్వయిజర్ గంగినేని ధనుంజయ, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులరెడ్డి, రిజిస్ట్రార్ ఆర్.సాంబశివరావు, మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ విశ్వక్‌సేనారెడ్డి, మేనేజ్‌మెంట్ హెడ్ తుమ్మల సుధీర్, డాక్టర్ ఆర్.వాణి తదితరులు పాల్గొన్నారు.

### సర్వోదయ కళాశాల
## ప్రిన్సిపల్‌గా నిర్మల్‌కుమార్

నెల్లూరు సర్వోదయ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎం.టైటస్ నిర్మల్‌కుమార్ నియమితులయ్యారు. 35 ఏళ్ళుగా ఇంగ్లీషు అధ్యాపకుడిగా ఉన్న ఆయనను యాజమాన్యం ప్రిన్సిపల్‌గా నియమించింది. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల ఉన్నతికి పాటుపడేందుకు సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులను ఏర్పాటు చేస్తామని, కమ్యూనికేషన్స్ స్కిల్స్, బ్యాంకు కోచింగ్ తరగతులు నిర్వహించడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను కళాశాల సిబ్బంది అభినందించారు.

**నెల్లూరు కబుర్లు**

## కరోనాపై అప్రమత్తం

కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో జిల్లాలో ఆ వైరస్ రాకుండా నివారించే చర్యల్లో భాగంగా జిల్లా కరోనా నోడల్ అధికారిగా జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఆర్.స్వర్ణలతను నియమించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, హోటళ్ళు, ప్రధాన కూడళ్లలో ఐఇసి మెటీరియల్‌ను ప్రదర్శనలో వుంచడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, త్వరితగతిన స్పందించే విధంగా ఏర్పాటు చేసిన వైద్యబృందంలో డాక్టర్లు ఎస్.కె.అబ్దుల్‌మొయిన్, శ్యాంసన్, షఫివుల్లా, సురేష్ తదితరులుంటారని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు పనిచేస్తుందని, ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం, ఐఎంఏ వారితో కూడా చర్చించి, ప్రతి ఆసుపత్రిలోనూ 15 నుండి 20 మంది పేషంట్లు వుండే విధంగా ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని సూచించడం జరిగిందని తెలిపారు.

### ప్యాసింజర్ కాదు..
## ఎక్స్‌ప్రెస్ రైలు

కాకినాడ పోర్టు–తిరుపతి మధ్య నడిచే 57257, 57258 ప్యాసింజర్ రైళ్ళు ఫిబ్రవరి1 నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్ళుగా మారాయి. కాకినాడ పోర్టు – రేణిగుంట మధ్య మాత్రమే ఎక్‌ప్రెస్ రైళ్ళుగా నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాజేష్ అన్ని రైల్వేస్టేషన్లకు సమాచారం పంపారు. వేళల్లోను మార్పు చేసినట్లు పేర్కొన్నారు. 17250 నెంబరుగా కాకినాడ పోర్టు నుంచి మధ్యాహ్నం 13.45 గంటలకు బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్ రైలు కావలికి 22.29 గంటలకు చేరుకుంటుంది. బిట్రగుంటకు 22.43, నెల్లూరుకు 23.28 గంటలకు, రేణిగుంటకు తెల్లవారుజామున 3.45 గంటలకు చేరుకుంటుంది. 17249 నెంబరు గల రైలు రేణిగుంటలో రాత్రి 22.20 గంటలకు బయలుదేరుతుంది. గూడూరుకు అర్ధరాత్రి 12.05, నెల్లూరుకు 12.40, బిట్రగుంట 1.10, కావలికి 1.30 గంటలకు, కాకినాడ పోర్టు స్టేషన్‌కు మధ్యాహ్నం12.15గంటలకు చేరుకుంటుంది.

## ధర్మప్రచారంలో భాగస్వాములు కండి!
### - పీఠాధిపతుల పిలుపు

జిల్లాలో జరుగుతున్న ధర్మప్రచార కార్యక్రమాల్లో ప్రతి హిందువు భాగస్వామి కావాలని పలువురు పీఠాధిపతులు పిలుపునిచ్చారు. ఈనెల 2న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయ కల్యాణమండపంలో సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చావేదికలో వారు మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, మనం వాటిని పరిరక్షించుకోవాలని ఉద్బోధించారు. హిందూ దేవాలయాల ప్రతిష్టాపన పీఠం వ్యవస్థాపకులు కమలానందభారతి స్వామి మాట్లాడుతూ సమరసత ఫౌండేషన్ వారు నిర్వహించే ధార్మిక కార్యక్రమాల్లో అందరూ పాల్గొని ధర్మాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఇనమడుగు సత్యానందాశ్రమం పీఠాధిపతి శ్రీహరితీర్థస్వామి, మడమనూరు గీతాశ్రమం ప్రణవానందస్వామి, ఇనమడుగులోని శ్రీకృష్ణ అఖండానందాశ్రమం వ్యవస్థాపకులు నిశ్చలానందస్వామి, నెల్లూరు చిన్మయమిషన్ నిర్వాహకులు పరమేశ్వరానందస్వామి, నరసింహ కొండలోని వేదగిరి ఆశ్రమం నుంచి మహేషానంద స్వామి, గాలిపాళెంలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం నుంచి శ్రీహరిస్వామి, వైకుంఠపురం ఆశ్రమం నుంచి తాతయ్యస్వామి, ఇస్కాన్ మందిరం వ్యవస్థాపకులు శుకదేవస్వామి, నెల్లూరు దత్తాత్రేయ మఠాధిపతులు అనంతగిరిస్వామి, దయానందస్వామి తదితర స్వామీజీలు పాల్గొని మాట్లాడారు.

సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ, పీఠాధిపతుల సూచనలు సలహాలతో మన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ధర్మప్రచారకులు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల
## నోడల్ అధికారిగా గోపి

నెల్లూరు నగరపాలక సంస్థ, మున్సిపల్ ఎన్నికలకు నోడల్ అధికారిగా కార్పొరేషన్ అదనపు కమిషనర్ గోపిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, నాయుడుపేట మున్సిపాల్టీలకు ఎన్నికల నోడల్ అధికారిగా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.





## సోమిరెడ్డికి పరామర్శల వెల్లువ

ఇటీవలే హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో గుండె రక్తనాళాలకు స్టంట్‌లు వేయించుకున్న మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ నెల 4వ తేదీన నెల్లూరొచ్చారు. అల్లీపురంలోని తన ఇంట్లోవున్న ఆయనను జిల్లాకు చెందిన తెలుగుదేశం, వైసిపి, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, జనసేన నాయకులతో పాటు ఆయా రంగాల ప్రముఖులు, జిల్లా వ్యాప్తంగా వున్న ఆయన అనుచరులు పెద్దఎత్తున వచ్చి పరామర్శించారు.

### ఉద్యోగ విరమణ సిబ్బందిని
## సత్కరించిన ఎస్పీ

పోలీసుశాఖలో సుదీర్ఘకాలం సేవలందించి గత నెల31న పదవీ విరమణ చేసిన జిల్లా పోలీసు శిక్షణ కళాశాల ఎస్ఐ జి.ఉమాదేవిని, డిఎస్పీ కార్యాలయ సి.సి. వి.జి.కృష్ణమూర్తిని ఎస్పీ భాస్కర్‌భూషణ్ సత్కరించారు. నెల్లూరు పోలీస్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పి.మనోహర్‌రావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాదరావు, ఆర్.ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిక



మొన్నటి ఎన్నికల తర్వాత అన్ని పార్టీలవాళ్ళు అధికార వైసిపిలో చేరడం ఎక్కువైంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అయితే టీడీపీ నుండి వైసిపిలోకి ఈ వలసలు ఎక్కువుగా వుంటున్నాయి. అయితే నేను మాత్రం తక్కువ తిన్నానా అన్నట్లుగా నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మాజీమేయర్ అబ్దుల్ అజీజ్ రంగంలోకి దిగాడు. తెలుగుదేశంలోకి వలసలను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాడు.

ఈ నేపథ్యంలోనే 31వ డివిజన్‌కు చెందిన పఠాన్ ఆషిక్ ఆలీఖాన్ 300 మంది యువకులు, మహిళలతో ఈ నెల 2వ తేదీన టీడీపీలో చేరారు. అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, ఖాజావలి, మన్నెం పెంచలయ్య, నెల్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### శ్రీరంగనాథుని
## దర్శించుకున్న న్యాయమూర్తులు

రథసప్తమిని పురస్కరించుకుని నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని ఈనెల 1న పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తలమండలి సభ్యులు వారికి సాదరంగా ఆహ్వానం పలికారు. శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారిలో జస్టిస్ టీఎస్ ఠాకూర్, విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి బి.సత్యనారాయణ, 8వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి అతిక్ అహ్మద్, ప్రోటోకాల్ ఆఫీసర్, మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్‌లు ఉన్నారు.

### అందరినీ ఆకట్టుకున్న
## 'కృష్ణచైతన్య' వైజ్ఞానిక ప్రదర్శన



నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఈనెల 1న నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ బాగా ఆకట్టుకుంది. కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని ఈ ప్రదర్శనకు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జవహర్‌భారతి కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డా. ఏ.విశ్వనాథ్‌రెడ్డి, అధ్యాపకుడు సివి సుబ్బారావు తదితరులు వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాలపై ఆసక్తిని కలిగించేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల వారు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లతో పాటు కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ యన్.కృష్ణకుమార్, యన్.నాగయ్య పాల్గొన్నారు.

## సిఏఏకు మద్దతుగా ర్యాలీ

పౌరసత్వ సవరణ చట్టానికి మద్దతుగా 2వ తేదీ బీజేపీ నగర శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో ర్యాలీ జరిగింది. హరనాథపురం సెంటర్ నుండి రామలింగాపురం ప్రధాన రోడ్డు మీదుగా బ్యాంకు కాలనీ, మినీ బైపాస్ వరకు ర్యాలీ నిర్వహించి, సిఏఏపై అవగాహన కల్పించేలా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యశ్వంత్‌సింగ్, సిహెచ్ శ్రీనివాసులు, కాయల మధు, ముక్కు రాధాకృష్ణగౌడ్, హరి, జయచంద్ర పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు
## పరికరాల పంపిణీ

2019–20 సంవత్సరం రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు గాను ఎంఎన్‌పి పరికరాలు 60 కొన్నారు. వీటిని కోవూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 3, కావలి ఏఎంసికి 8, సూళ్లూరుపేటకు 9, నాయుడుపేటకు 3, గూడూరు 2, వాకాడుకు 3, ఆత్మకూరుకు 15, ఉదయగిరికి 15, వెంకటగిరికి 14 పరికరాలు అందజేశారు. నెల్లూరు ఏఎంసి ఛైర్మెన్ ఏసునాయుడు చేతులమీదుగా ఈ పరికరాలను అందజేశారు.

# ఏపికి ఎర్రగడ్డలు ఎన్నిచ్చారు?

**- లోక్‌సభలో ఆదాల**



దేశంలో ఉల్లిపాయల కొరత విపరీతంగా వున్న తరుణంలో విదేశాల నుండి కొనుగోలు చేసిన ఎర్రగడ్డలను రాష్ట్రాల వారీగా ఏ మేరకు పంపిణీ చేశారని, అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్నిచ్చారని మంగళవారం లోక్‌సభ సమావేశంలో నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఆయన కోరారు. దీనికి కేంద్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి దన్వే రావు సాహెబ్ దాదారావు వ్రాతపూర్వక సమాధానమిస్తూ విదేశాల నుండి దిగుమతి చేసుకున్న ఉల్లిపాయలను ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 49 నుండి 58 రూపాయల మేరకు ధరతో సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది జనవరి 31 వరకు 226 కోట్లతో 2,609.95 మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలను దిగుమతి చేసుకుని సరఫరా చేశామని, ఆంధ్రప్రదేశ్‌కు 893.18 మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలను అందించడం జరిగిందని ఆయన వెల్లడించారు.

అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని మొక్కజొన్న రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎన్ని ఇచ్చారని లోక్‌సభలో ఆదాల అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ సమాధానమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 25చోట్ల విత్తన నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఆంధ్ర ప్రదేశ్‌లో విజయనగరం, నంద్యాలలో విత్తన నిల్వ కేంద్రాలకు 50 లక్షల రూపా యల లెక్కన కేటాయించినట్లు తెలిపారు.

అలాగే నగరాలలో కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారని ఆదాల వేసిన ప్రశ్నకు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ సమాధానమిస్తూ వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు నగరాలలో విద్యుత్ వాహనాలను సరఫరా చేయడమే కాక వాటి ఛార్జింగ్‌కు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు, దేశంలోని 24 రాష్ట్రాల నుండి 7వేల ఛార్జింగ్ స్టేషన్‌లకు 106 ప్రతిపాదనలు రాగా, అందులో 2636 మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే బుధవారం సభలో ఆయన ఏపికి రైల్ల మంజూరుపై ప్రశ్నించారు. రైల్వేమంత్రి పీయూష్ గోయల్ సమాధానమిస్తూ రాష్ట్రాలవారీగా రైళ్లు వేయలేమని, అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాల మధ్య రైళ్ళు నడపడం జరుగుతుందన్నారు.

# ఓట్ల లెక్క తేలింది!


- 4.78 లక్షల మంది నెల్లూరు ఓటర్లు
- పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ

నెల్లూరు నగర ఓటర్ల జాబితాను ఎట్టకేలకు ఈనెల 3న ప్రకటించారు. పురుషులు 2,38,774 మంది, స్త్రీలు 2,39,358 మంది, ఇతరులు 75 మంది కలిపి మొత్తం 4,78,207 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ తాజా జాబితాలో పురుషుల కంటే స్త్రీలే 584 మంది అధికంగా ఉన్నట్లు లెక్క కట్టారు. త్వరలోనే మునిసిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, అందుకు చేయాల్సిన ఏర్పాట్లపై నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి అధికారులతో చర్చించారు. నగరంలోని 54 మునిసిపల్ డివిజన్లలో 7 లక్షలమందికి పైగానే జనాభా ఉన్నారు. డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా తయారీకి సంబంధిత అధికారులు ప్రత్యేకదృష్టి సారించారు. ముసాయిదా జాబితాలను స్థానిక ఎన్ఎంసి కార్యాలయంతో పాటు, కలెక్టరేట్, ఆర్డీఓ, రిజిస్ట్రేషన్, తహశీల్దార్ కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉంచుతున్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లోనూ ఓటర్ల ముసాయిదా జాబితాలు సిద్ధమయ్యాయి. అన్ని డివిజన్లకు ఓటర్ల జాబితాలు చేరడంతో స్థానికంగా కార్పొరేటర్ పదవులకు పోటీ చేయాలనే ఆసక్తి వున్న నాయకులు వాటిని పట్టుకుని కులాలు, మతాల వారీగా ఓట్ల లెక్కలు తీస్తున్నారు.

జిల్లాలో మొత్తంగా మునిసిపాలిటీల్లో 1.50 లక్షల మంది ఓటర్లు పెరిగినట్లు అధికారులు చెప్తున్నారు. కొత్త ఓటర్ల జాబితా ప్రకారం గూడూరులో 79,735 మంది ఓటర్లుండగా, వీరిలో స్త్రీలు 43,377 మంది, పురుషులు 38,328 మంది, ట్రాన్స్‌జెండర్లు 30 మంది ఉన్నారు. వెంకటగిరి మునిసిపాల్టీలో మొత్తం 43,392 మంది ఓటర్లుండగా, వీరిలో స్త్రీలు 22,332 మంది, పురుషులు 21,055 మంది, ట్రాన్స్‌జెండర్లు 10 మంది ఉన్నారు. కావలిలో మొత్తం 98,246 మంది ఓటర్లుండగా స్త్రీలు 50,519 మంది, పురుషులు 47,404 మంది, ట్రాన్స్‌జెండర్లు 23 మంది ఉన్నారు. నాయుడుపేటలో మొత్తం ఓటర్లు 36,051 మంది ఉండగా, స్త్రీలు 18,787 మంది, పురుషులు 17,257 మంది, ట్రాన్స్‌జెండర్లు 7గురు ఉన్నారు.

# తుదిశ్వాస వరకు జగన్‌తోనే ఉంటా!

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి**



తుదిశ్వాస వరకు తాను జగన్‌తోనే ఉంటానని, ఇందులో ఎవరికీ అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 1న ఆయన కోవూరు నియోజకవర్గంలోని విడవలూరులో విలేకరులతో మాట్లాడుతూ, కొందరు పనిగట్టుకుని తనను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నుంచి దూరం చేయాలని తనపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాట్లాడిన మాటలను దొంగచాటుగా వీడియో తీసి, అందులోని మంచిని తీసివేసి వాళ్ళ ఇష్టంవచ్చిన రీతిలో తప్పుడు కథనాలు వచ్చేలా చేశారన్నారు. తద్వారా తనను జగన్మోహన్‌రెడ్డి నుంచి దూరం చేయాలన్నదే వారి లక్ష్యమని, అయితే అది వారికి సాధ్యం కాదని అన్నారు.

**7నెలల్లో 80 కోట్ల అభివృద్ధి పనులు**

కోవూరు నియోజకవర్గంలో కేవలం ఈ ఏడునెలల కాలంలోనే కనీవినీ ఎరుగని విధంగా 80కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గత టిడిపి ప్రభుత్వం కేవలం శిలాఫలకాలు వేసి ప్రజలను మోసగించిందని ఆయన విమర్శించారు.

వృద్ధాప్య పింఛన్లు వీలైనంత ఎక్కువ మంది వృద్ధులకు అందాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో ఈ పింఛనుదార్లకు ఉన్న వయసును 65 ఏళ్ళ నుంచి 60కి తగ్గించారని ఎమ్మెల్యే కొనియాడారు. ఇంకా అమ్మఒడి, వైయస్సార్ కంటి వెలుగు, రైతు భరోసా వంటి పథకాలతో ఆయన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవతో బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీగా మారిందని, రాష్ట్రంలో పది మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవగా అందులో కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెంకు తొలి అవకాశం కల్పించారని అంటూ అందుకు తాను ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, , పవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గంలోని వైకాపా నాయకులు ఇప్పగుంట విజయభాస్కర్, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గంధం వెంకటశేషయ్య, నలబోలు సుబ్బారెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, డి.నిరంజన్ బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో..
# ఉత్సాహంగా జాతీయ సమైక్యతా మారథాన్



ఈనెల 2న శ్రీసిటీలో జాతీయ సమైక్యతా మారథాన్ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంతో నిర్వహించారు. వేకువనే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వందలాదిమంది వివిధ వయస్కులవారు శ్రీసిటీకి తరలివచ్చారు. ట్రిపుల్ ఐటి, క్రియా, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ మారథాన్, క్రియా యూనివర్శిటీ నుంచి శ్రీసిటీ ఎక్స్‌ప్రెస్ హైవేపై 5కె, 10కె, 15కె రన్ విభాగాలతో ఎంతో కోలాహలంగా సాగింది. ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కన్నాభిరాన్, ప్రొఫెసర్ జివి చలం సమక్షంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్స్ రిలేషన్) సి.రమేష్‌కుమార్ తొలుత మారథాన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు సుమారు 11వందల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలా వరుసగా ఈ 5వ సంవత్సరం కూడా శ్రీసిటీలో మారథాన్ నిర్వహించి అందరిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ కమ్యూనిటీ నుంచి ఎంతోమంది పెద్దసంఖ్యలో ఈ మారథాన్ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సమాజంలో ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు, శక్తివంతమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు తాము ఎప్పటికీ కట్టుబడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విజేతలైన 36 మందికి ట్రిపుల్ ఐటి డైరెక్టర్ జి.కన్నాభిరాన్, క్రియా యూనివర్శిటీ డీన్ డాక్టర్ శోభాదాస్ బహుమతులు ప్రదానం చేశారు. మారథాన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్ జివి చలం తదితరులు విచ్చేసి మారథాన్‌లో పాల్గొన్నవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీలో కరోనా భయం లేదు

**వైరస్ దరిచేరకుండా ముందు జాగ్రత్తలు**

చైనాలో కరోనా వైరస్ వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో, శ్రీసిటీకి చెందిన ఒక సంస్థలోని ఉద్యోగులు డిప్యుటేషన్‌పై చైనాకు వెళ్ళినట్లు, వారిలో కొందరు ఆ వ్యాధిబారిన పడినట్లు కొన్ని పత్రికలు, ఛానళ్ళలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని శ్రీసిటీ యాజమాన్యం స్పష్టం చేస్తూ ఆ అవాస్తవ వార్తలను ఖండించింది. ఆ వార్తల్లో ఉన్న సంస్థ శ్రీసిటీ నుంచి 70కిలోమీటర్ల దూరంలో ఉన్న రేణిగుంట పారిశ్రామిక ప్రాంతంలో ఉందని పేర్కొంది. లేనిపోని దుష్ప్రచారాలు చేయడం వల్ల ఈ ప్రాంతప్రజల్లో భయాందోళనలు కలిగే అవకాశం ఉందని, అందువల్ల శ్రీసిటీ యాజమాన్యం ఇప్పటికే ఇక్కడ ఉన్న అన్ని చైనా సంస్థలతో చర్చించి, ఇటీవల కాలంలో ఉద్యోగులు ఎవరూ చైనాకు రాకపోకలు సాగించలేదని నిర్ధారించిందని యాజమాన్యం వివరించింది. శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ మాట్లాడుతూ, శ్రీసిటీలో కరోనా వైరస్‌కు సంబంధించి ఎలాంటి ఆందోళన అవసరం లేదని, తాము ఇప్పటికే ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కాగా, చిత్తూరుజిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌తో పాటు చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు శ్రీసిటీలోని చైనా కంపెనీలను సందర్శించి సంబంధిత అధికారులతో చర్చించారు. కరోనా వైరస్‌పై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వారికి వివరించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# గూడూరు డివిజన్ వార్తలు

## పెన్షన్ రానివాళ్ళు ఆందోళన చెందొద్దు



**- సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ**

అర్హులుగా ఉండి పెన్షన్లు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారని, కొంత మంది పెన్షన్లు రాలేదన్న ఆందోళనలో వున్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పెన్షన్లు రానివారు కారణం తెలుసుకొని వాలంటీర్ల ద్వారా గ్రామ సచివాలయాల్లో పూర్తి ఆధారాలు అందజేస్తే వారి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఎంపిడివోను కలవాలని, లేదా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వస్తే తామే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

## ఎంపీని అడ్డుకోవడం దారుణం



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాపట్ల ఎంపి నందిగం సురేష్‌ను అమరావతిలో తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ పట్టణంలోని తపాలా కార్యాలయ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు రత్నం మాట్లాడుతూ ఎంపీని అడ్డుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులను అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భాస్కర్, గోవిందు, శంకర్, రమణరావు, మల్లిబాబు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఉద్యోగుల నిరసన



ఎల్ఐసిని షేర్ మార్కెట్‌లో పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం గూడూరులోని ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. భోజన విరామ సమయంలో అన్ని యూనియన్ల నాయకులు, సభ్యులు నిరసనలో పాల్గొన్నారు. రాజశేఖర్‌రెడ్డి, శివకుమార్, జగదీష్, దూబగుంట శ్రీనివాసరావు, మాలకొండయ్య, గురునాథం పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకులు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తాజుద్దీన్

గూడూరు పట్టణ పరిధిలోని ఎగువ వీరారెడ్డి పల్లిలో ఆదివారం డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 20మంది వితంతువులు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు తాజుద్దీన్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా వితంతువులు, నిరుపేద మహిళలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపాడు.

## ఓటర్ల తుది జాబితా విడుదల



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఓబులేసు

గూడూరు పురపాలక సంఘం ఓటర్ల తుది జాబితాను మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, పురపాలక అధికారులతో కలిసి సోమవారం విడుదల చేశారు. గూడూరు పట్టణం, విలీన పంచాయితీలతో కలిపి 34 వార్డుల్లో మొత్తం 79,735 ఓట్లు ఉండగా అందులో మహిళలు 41,377, పురుషులు 38,328 మంది, ఇతరులు 30 మంది ఉన్నారు. అత్యధికంగా 34వ వార్డులో 2913 ఓట్లు ఉండగా, అత్యల్పంగా 3వ వార్డులో 1722 ఓట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓటర్ల తుది జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాను సబ్‌కలెక్టర్, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లు, అభ్యంతరాలు వుంటే అధికారులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మేనేజర్ కృష్ణారెడ్డి, టిపిఎస్ ప్రకాష్, అధికారులు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం




ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు డాక్టర్ మైథిలి, నర్సింగ్ విద్యార్థులు

క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి వుండాలని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మైథిలి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల నుంచి పుర వీధుల్లో ప్రభుత్వ వైద్యులు, రత్నమ్మ నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మైథిలి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య నియమాలు పాటిస్తే ఎటువంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. వైద్యులు చంద్రహాస్, రాజా, నర్సింగ్ కళాశాల ప్రతినిధులు రమణబాబు, సురేఖ, మస్తానయ్య కార్తిక్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.




# చతుర్థ వర్థంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,
నిరంతర ప్రజాసేవకుడు

## చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు

(మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

పరమపదించి తేది. 9.2.2020 నాటికి నాలుగేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

బావమరిది - డా॥ చిల్లకూరు మోహన్‌రెడ్డి, చెన్నై
అల్లుడు - ప్రొ॥ సి.యం.కె.రెడ్డి, చెన్నై
కుమార్తె - చిల్లకూరు నిర్మల
కోడలు - డా॥ చిట్టమూరు భారతి, USA
మనుమడు - డా॥ చిల్లకూరు కిషోర్, చెన్నై
మనుమరాలు - కొవ్వూరు హరిత, కాకినాడ
మనుమరాలు - ప్రణీత అరవింద్, USA
మనుమడు - చిట్టమూరు లోహిత్, USA

# ఎంతో అపూర్వం.. 'పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు'




**రచన : డా. మాచవోలు శివరామప్రసాద్**
**వెల: రూ.200/-   పేజీలు: 248**
**ప్రతులకు:**
**డా. ఎం.శివరామ ప్రసాద్**
**4-638, ఉస్మాన్‌సాహెబ్ పేట,**
**నెల్లూరు-524 002. సెల్: 9441595080**

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయత డా. మాచవోలు శివరామప్రసాద్ ఇటీవలే వెలువరించిన 'అముద్రిత గ్రంథ చింతామణి 1885–1904, పూండ్ల రామకృష్ణయ్య సాహిత్యలేఖలు' అనే గ్రంథంలో ఆయన సేకరించిన పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు సారస్వతలోకానికి ఎంతో ఉపయోగకరమైనవి.. అపూర్వమైనవి కూడా. డా. మాచవోలు గారు నెల్లూరు సర్వోదయ కళాశాలలో తెలుగు శాఖాధిపతిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రత్యేకించి 'పూండ్ల రామకృష్ణయ్య–సాహిత్యసేవ' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. వీరి సంపాదకత్వంలో 'అలనాటి సాహిత్య విమర్శ– అముద్రిత గ్రంథ చింతామణి' అనే గ్రంథాన్ని ఆంధ్రప్రదేశ్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ–హైదరాబాద్ వారు ప్రచురించారు. మనసు ఫౌండేషన్ వారి 'గురుజాడలు' పుస్తక ప్రచురణలో కూడా ఆయన ప్రముఖ పాత్రను పోషించారు. వాఙ్మయి తదితర పత్రికల్లో ఆయన వ్యాసాలు రాశారు.

దాదాపు పాతికేళ్ళుగా శివరామప్రసాద్ గారు ఎంతో జిజ్ఞాసతో 'పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య లేఖలు' సేకరించి వాటిని ఎంతో భద్రంగా ఉంచారు. వాటినన్నిటినీ ఇప్పుడు సాహిత్యాభిమానుల కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఒక గ్రంథంగా తీర్చిదిద్ది ప్రచురించారు.

నెల్లూరు నివాసి పూండ్ల రామకృష్ణయ్య గారు 1885లో 'అముద్రిత గ్రంథ చింతామణి' అనే సాహిత్య మాసపత్రికను ప్రారంభించి, తాను మరణించేవరకు (1904) ఎంతో కష్టపడి దానిని కొనసాగించారు. అందులోనూ ఇరవై తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి ప్రచురించారు. సంపాదకునిగా, గ్రంథ ప్రచురణకర్తగా ఇరవై ఏళ్ల సుదీర్ఘకాలంలో ఆయన కవులకు, పండితులకు వందల సంఖ్యలో లేఖలు రాశారు. వాటిలో కొన్నింటిని పత్రికలో ప్రచురించగా, మిగిలినవి ఎన్నో కాలగర్భంలో కలసిపోయాయి.

పూర్తిగా శిథిలావస్తకు చేరుకుని, తాకితేనే చిరిగిపోయే అలాంటి ఎన్నో లేఖలను శివరామప్రసాద్ గారు ఎంతో శ్రమకోర్చి సేకరించి, కాలానుక్రమణిక ప్రకారం అచ్చువేశారు. 1899లో అచ్చయిన 'ఆంతరంగిక లేఖలు' అనే పుస్తకాన్ని కూడా ఇందులో చేర్చారు. ఈ లేఖల్లో పూండ్ల రామకృష్ణయ్య వాడిన సంక్షిప్త రూపాలు, విమర్శలు, ప్రశంసలు, ఎత్తిపొడుపులు అన్నీ కనిపిస్తాయ. ఆనాటి పత్రికా సంపాదకులు పత్రికలను నడపడానికి పడిన అవస్తలు ఈ ఉత్తరాల్లో కన్పిస్తాయి. సాహిత్యంతో సంబంధం లేని అనేక అంశాలు కూడా ఈ లేఖల్లో ఉన్నాయి.

శివరామప్రసాద్ గారు సమకూర్చిన నోట్సులో ఆనాటి సాహిత్యచరిత్ర, పత్రికల తీరు తెన్నులు, పండితుల వాగ్వివాదాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. గ్రంథాలను తులనాత్మకంగా పరిశీలించడం, అనౌచిత్య విచారణ, కాలానికి–విషయానికి తగిన భాషను ఉపయోగించాలన్న ఆలోచనలు ఆనాటికే ఉన్నాయని ఈ లేఖలు చదివిన పాఠకులు గమనిస్తారు.

ఆయా పండితుల కష్టనష్టాలు, మానవసహజమైన కోపతాపాలు, యధార్ధజీవిత అనుభవాలు, కీర్తికోసం పడిన ఆరాటాలు, భుక్తి కోసం పడిన తాపత్రయాలు అన్నీ ఈ లేఖల్లో మనకు స్పష్టంగా కనిపిస్తాయి. వారి ప్రతిభావ్యుత్పత్తులు మనల్ని విస్మయానికి గురిచేస్తాయి. ఇంతేకాక, స్థానిక చరిత్రను, ఆనాటి భాషా స్వరూపాన్ని తెలుసుకోవడలో మనకెంతగానో ఉపయోగపడతాయి. అందుకే రచయితను ఈ లేఖల ప్రచురణ విషయమై ప్రముఖ చరిత్రకారులైన నేలనూతల శ్రీకృష్ణమూర్తి (ఎన్నెస్కే) గారు ఎంతగానో ప్రోత్సహిస్తూ వచ్చారు.

పూండ్ల రామకృష్ణయ్య సాహిత్యలేఖలు పుస్తకం చూశాక, 'లేఖలు కూడా అచ్చువేస్తారా?' అనే ధర్మ సందేహం పాఠకులకు రావచ్చు. కానీ, ఇవి సాధారణ లేఖలు కావు. ఆ లేఖల ద్వారా ఆనాటి భాషా, సాహిత్య, సామాజిక, ఆర్ధిక, చారిత్రక పరిస్థితులను తెలుసుకునేందుకు ఈ లేఖలు ఎంతగానో ఉపయోగపడతాయని వీటిని చదివితే మనకర్ధమవుతుంది. ఇంతకు మించిన సాహిత్యప్రయోజనం ఇంతకన్నా ఇంకా ఏం కావాలి?...

సెల్‌ఫోన్‌లు వచ్చి, సంక్షిప్త సందేశాలను పొడిపొడి మాటల్తో పంచుకోవడం అలవాటయ్యాక లేఖలు రాయడమనేది దాదాపు తగ్గిపోయిన కాలమిది. కానీ నాటి లేఖాసాహిత్యం అత్యంత విలువైనదని పాతతరం వారికి బాగా తెలిసినదే. తండ్రిగారు రాసిన లేఖల వల్లే ఇందిరాగాంధీ వంటి వీరవనిత సమాజం గురించి ఎంతో తెలుసుకుందని అందరికీ విదితమే. ఆ విధంగా చిన్నవయసులోనే విద్యార్థులకు భాషాజ్ఞానం, భావప్రకటనాశక్తి, రచనాశక్తి అలవడేవి. ఇప్పుడా కాలం చెల్లిపోయింది మరి!.. ఏదేమైనా, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఇంత మంచి లేఖాసాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించిన డా. మాచవోలు శివరామ ప్రసాద్ గారు ఎంతైనా అభినందనీయులు!...



**సమీక్షకులు:**
**డా. గంగిశెట్టి శివకుమార్**
**నెల్లూరు. 94418 95343**

# కరోనా వైరస్‌కు నెల్లూరు ట్రీట్‌మెంట్

అది జెనీవాలోని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయం. చైనాలో కరోనా వైరస్ విజృంభించిన తరుణంలో ప్రపంచమంతా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించారు. కరోనా వైరస్‌ను ఎలా అరికట్టాలన్నదానిపై అన్ని దేశాల అధినేతలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ అధ్యక్షతన జరుగుతున్న ఆ సమావేశానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్, జర్మనీ ఛాన్సలర్ మోర్కెలా ఏంజల్, భారత ప్రధాని నరేంద్ర మోడీ, వివిధ దేశాల అధినేతలు హాజరయ్యారు. అప్పుడే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ హాల్‌లోకి అడుగుపెట్టాడు. అతడు అక్కడకు అడుగుపెట్టగానే ఒక్క భారత ప్రధాని నరేంద్రమోడీ తప్ప మిగతా అన్ని దేశాల అధినేతలు అతనివైపు అసహ్యంగా చూడసాగారు. వారిలో పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కూడా వున్నాడు. జిన్‌పింగ్ రావడంతో అందరూ అతనిని కరోనా వైరస్ మాదిరిగా చూస్తూ ముక్కులకు మాస్క్‌లు తగిలించారు. కాని, నరేంద్ర మోడీ మాత్రం మాస్క్ తగిలించుకోలేదు. అందరూ మోడీ వైపు చూస్తూ... ఇతనికింత గట్స్ వున్నాయేంట్రా అని మనసుల్లో అనుకున్నారు. జిన్‌పింగ్ నేరుగా వచ్చి డోనాల్ట్ ట్రంప్ పక్కన కూర్చున్నాడు. ఆయన టక్కున... ఏయ్ లెయ్ లెయ్... అటు దూరంగా కూర్చో అని అసహ్యించుకున్నాడు. జింగ్‌పింగ్ కిమ్మనకుండా లేచి... ఎంతైనా ఫ్రెండ్ కదా, పక్కన కూర్చోపెట్టుకుంటాడులే అని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పక్కన కూర్చున్నాడు. వెంటనే ఇమ్రాన్... తూ ఇదేం దరిద్రం... ఆ కరోనా వైరస్ నాకెక్కడ అంటిస్తాడో అని గొణుక్కుంటూ లేచి దూరంగా ఖాళీగా వున్న సీట్లో కూర్చున్నాడు. జిన్‌పింగ్‌కు తొలిసారిగా తన మీద తనకే అసహ్యమేసింది. ఎంత అభివృద్ధి చెందితే ఏం లాభం... రోగం పాలైతే మనిషి బ్రతుకు ఇంత నికృష్టంగా మారుతుందా అని మనసులో అనుకున్నాడు. మేం వేలకోట్ల జీవులను చంపి తిన్నాం.. ఆ పాపం ఇప్పుడు మమ్మల్ని వెంటాడుతున్నట్లుందనుకున్నాడు. జిన్‌పింగ్‌ను తమ పక్కన కూర్చోబెట్టుకోవడానికి అందరూ భయపడుతుండడాన్ని దూరంగా వున్న మోడీ గమనించాడు. వెంటనే జిన్‌పింగ్ ఇటురా... నా పక్కన కూర్చుందువురా అని కేకేశాడు. అది విని మిగతావాళ్లందరూ నోరెళ్లబెట్టారు. ఈ మోడీ ఏంట్రా చావుతో పరాచకాలాడుతున్నాడు, అసలు ఇతని ధైర్యమేంటి.. అని సందేహించసాగారు. జిన్‌పింగ్ మాత్రం నరేంద్ర మోడీ పక్కసీట్లో కూర్చుని ఆయన రెండు చేతులు పట్టుకుని.. ఇన్నాళ్లు మీ పట్ల మేం చేసిన తప్పులను మన్నించండి, మనిషి సుఖాల్లో వున్నప్పుడు అందరూ వెంట వుంటారు, కాని కష్టాల్లో వున్నప్పుడు తోడున్నవాళ్లే నిజమైన స్నేహితులని నిరూపించారు. స్నేహానికి మీ దేశం చాలా గొప్పదని ఎంతోమంది చెప్పారు. నేను నమ్మలేదు, కాని ఈరోజు చూస్తున్నాను, అయినా నేను ఈ హౌస్‌లోకి రాగానే అందరూ ముక్కులకు మాస్క్‌లు తగిలించుకున్నారు, నన్ను ఒక ఎయిడ్స్ రోగిగా చూస్తూ పక్కన కూర్చోబెట్టుకోవడానికి కూడా నిరాకరించారు. కాని, మీరు మాత్రం నన్ను ఒక మనిషిలా చూశారు, నేను చైనా నుండి వస్తున్నానని, ప్రపంచాన్ని కరోనా వైరస్ వణికిస్తుందని తెలిసి కూడా మీరు ఇంత తాపీగా నన్ను పక్కన కూర్చోబెట్టుకున్నారు, ఏంటి మీ ధైర్యం అని ప్రశ్నించాడు. దానికి నరేంద్ర మోడీ... మా నెల్లూరే నా ధైర్యం అని చెప్పాడు. జిన్‌పింగ్‌కు అది అర్ధం కాకున్నా ఔనా.. అనేసి తలూపాడు.

తర్వాత సమావేశం జరిగింది. భారతదేశం వల్లే కరోనా వైరస్ వ్యాపిస్తుందని ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించాడు. అదెట్లా అని సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ ప్రశ్నించాడు. ప్రపంచంలో ఏ వైరస్ సోకినా భారత్‌పై ఆరోపణలు చేయడం నా లక్ష్యం అని చెప్పాడు. "ఇల్లు కాలి ఒకడేడుస్తుంటే చుట్టకు నిప్పు దొరికిందని సంతోషించాడట నీలాంటోడు".. ప్రతిదాన్నీ భారత్‌కు ముడిపెడతావ్ కూర్చో అని ట్రంప్ ఇమ్రాన్‌ను తిట్టి... కరోనా వైరస్ ప్రబలిన 'ఉహాన్' నగరంలో మనమంతా పర్యటిద్దాం... వైరస్ ఎలా వ్యాపించిందో కనుక్కుని నివారణ మార్గాలు అన్వేషిద్దామని ప్రతిపాదించాడు. అందరూ దానికి సరేనన్నారు.

★★★★★

చైనాలోని ఉహాన్ నగరంలో మాంసం మార్కెట్. అన్ని దేశాల అధినేతలు చంద్రమండలంకు బయలుదేరిన వ్యోమగాముల్లాగా స్పేస్ షూట్‌లు ధరించారు. వారి సెక్యూరిటీ సిబ్బంది కూడా వాటిని ధరించారు. కాని, భారత ప్రధాని నరేంద్ర మోడీ గాని, ఆయన కార్యదర్శులు, భద్రతా సిబ్బంది గాని ఎలాంటి మాస్క్‌లు ధరించలేదు. ఇక ట్రంప్ వుండబట్టలేక.. మోడీ గారు... కరోనా వైరస్ ప్రబలిన మార్కెట్‌లో మనం అడుగుపెట్టాం, మీరు మాస్క్‌లు ధరిస్తే మంచిదని సలహా ఇచ్చాడు. అందుకు మోడీ కృతజ్ఞతలు చెబుతూ... మాకు ఆ మాస్క్‌లతో అవసరం లేదన్నాడు. ఇంత ప్రమాదకరమైన ప్రాంతంలో తిరుగుతూ కూడా మీరు మాస్క్‌లు ధరించడం లేదంటే ఏంటి మీ ధైర్యం అని ట్రంప్ ప్రశ్నించాడు. మా నెల్లూరే మా ధైర్యం అని మోడీ చెప్పాడు. తర్వాత, అందరూ ఆ మార్కెట్‌లో తిరగసాగారు. ఎలుకలు, చిలుకలు, పాములు, కప్పలు, మొసళ్ళు, తేళ్ళు, తొండలు, తోడేళ్ళు, కుక్కలు, నక్కలు... ఆ మార్కెట్‌లో సకల జీవరాశిని అమ్ముతున్నారు. ఆ మార్కెట్‌ను చూస్తేనే అందరికీ ఒళ్ళు జలదరించసాగింది. అవన్నీ చూశాక మోడీ... ఇవన్నీ తింటే కరోనా వైరస్ రాక కత్రినా కైఫ్ వస్తుందా... కడుపును యజ్ఞవాటికలాగా చేసి వెజిటేరియన్ తింటే ఏ వైరస్ రాదు.... కాని మీ కడుపులను మీరు శ్మశాన వాటికగా మారుస్తూ... అందులో ఈ జీవరాశులన్నింటి శవాలను కాలుస్తున్నారు, అందుకే ఈ వైరస్ అని కోపంగా చెప్పాడు. తర్వాత అందరూ అక్కడ కొత్తగా కట్టిన కరోనా ఆసుపత్రిలోకి వెళ్ళారు. పేషంట్లు చికిత్స పొందుతున్న వార్డుల్లోకి వెళ్లడానికి ఎవ్వరూ సాహసం చేయలేదు, కాని నరేంద్ర మోడీ మాత్రం నేరుగా కరోనా పేషంట్ల వద్దకు వెళ్లి వారి చేతులు పట్టుకుని పరామర్శిస్తూ వారికి ధైర్యం చెప్పసాగాడు. ఇదంతా దూరంగా నిలబడి చూస్తున్న మిగతా దేశాధినేతలంతా విస్తుపోయారు. మోడీ ధైర్యానికి వాళ్లకు మాటలు రావడం లేదు. మోడీ రోగులను పరామర్శించి బయటకొచ్చాడు. పుతిన్ ఆయన వద్దకెళ్లి, మేమింతమందిమి, అక్కడ పేషంట్ల దగ్గరకు రావడానికి భయపడ్డామా, మరి మీ ధైర్యమేంటి? అని ప్రశ్నించాడు. నా నెల్లూరే నా ధైర్యం అని మోడీ చెప్పాడు. అప్పుడు జిన్‌పింగ్ చిరాగ్గా... ఇందాకటి నుండి అదే మాట చెబుతున్నారు... అసలేంటి నెల్లూరు... దాని వెనకున్న కథేంటి అని అడిగాడు. దానికి మోడీ... మీ దేశంలో కరోనా వైరస్ ఎట్లా డెవలప్ అయ్యిందో, మా నెల్లూరులో ఐఆర్ 20–420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు అలా డెవలప్ అయ్యాయి. ఇంతటి భయంకరమైన విషపు జాతి దోమలు అమేజాన్ అడవుల్లో కూడా వుండవు. ఈ నెల్లూరు జాతి దోమలను అభివృద్ధి చేసి దేశమంతా వదిలాం... వీటి కాట్లకు మా దేశ ప్రజలు అలవాటుపడ్డారు. కాబట్టి వీటికే అలవాటుపడ్డ మమ్మల్ని ఇంకే వైరస్ ఏమీ చేయలేదు... అదీగాక ఈ జాతి దోమలున్న చోట ఇంకో వైరస్ వ్యాప్తి చెందలేదు. మా దోమల దెబ్బకు ఎలాంటి వైరస్ అయినా పారిపోవాల్సిందే అని చెబుతూ... మీకు పది టన్నుల దోమలను పంపిస్తాం, దేశమంతా వదలండి, కరోనా వైరస్‌ను తరిమికొడతాయి అని చెప్పాడు. దానికి జిన్‌పింగ్... అలా అయితే 20వేల టన్నులు పంపించండి అని అడిగాడు. 10వేల టన్నులు సరిపోతాయి, 20వేల టన్నులు ఏం చేసుకుంటారు... అని మోడీ ప్రశ్నించాడు. అందుకు జిన్‌పింగ్... 10వేల టన్నులు దేశమంతా వదులుతాం... ఇంకో 10వేల టన్నులతో పులుసు కాసుకుని తాగుతాం.. అసలే శక్తివంతమైన జీవరాశి అంటున్నారు కదా అని అన్నాడు. ఆ మాటకు నరేంద్ర మోడీకి అరికాల్లో మండింది. ఆఖరుకు మా దోమలను కూడా వదలరా... మీ బుద్ధింతే... మీరు మారరు... మిమ్మల్ని ఈ వైరస్‌లు వదలవు అంటూ తిట్టి కోపంగా అక్కడ నుండి కదిలాడు.

## అల్లూరు పోలేరమ్మతల్లికి..
# వేడుకగా పల్లకి సేవ



పిలిస్తే పలికే దైవంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్ప వల్లిగా.. అందరినీ కాపాడే చల్లనితల్లిగా ప్రసిద్ధిగాంచిన అల్లూరు గ్రామదేవత శ్రీ పోలేరమ్మతల్లికి ఈనెల 4న మంగళవారం సాయంత్రం 6 గంటలకు అత్యంత వైభ వంగా పల్లకిసేవ నిర్వహిం చారు. ఆలయ అర్చకుల మంత్రోచ్ఛటనల మధ్య, మంగళవాయిద్యాల మధ్య, అమ్మవారి నామస్మరణలు మారుమ్రోగుతుండగా పల్లకి సేవ ఎంతో వేడుకగా జరి గింది. బెంగుళూరులోని దేవిరెడ్డి కృష్ణారెడ్డి-అరుణ దంపతులు ఉభయకర్తలుగా ఉండి సనాతన ధర్మం ప్రకారం, శాస్త్రయుక్తంగా ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కైంకర్యాన్ని నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన దేవిరెడ్డి రఘురామిరెడ్డి, వైజాగ్‌కు చెందిన మేడా శివారెడ్డిలు ఈ కార్యక్రమం అత్యద్భుతంగా జరిగేందుకు సహకరించారు. ఈ వేడుకలో పెద్దసంఖ్యలో పాల్గొన్న అమ్మవారి భక్తులందరికీ ఉభయదాతలు తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాలధర్మం

### బద్దెపూడి వేణుగోపాలరెడ్డి



సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది బద్దెపూడి వేణుగోపాలరెడ్డి ఈ నెల 5వ తేదీ స్వర్గస్తులై నారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమమారులు, ఒక కుమార్తె వున్నారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు ఆయన స్వగ్రామం. న్యాయవాద కోర్సును పూర్తి చేసిన అనంతరం ఆయన 1966లో వెంకటగిరిలో న్యాయవాదిగా వృత్తిని మొదలుపెట్టారు. 1970లో సూళ్లూరుపేటలో కోర్టును ఏర్పాటు చేశాక ఆ కోర్టులో తొలి న్యాయవాది ఆయనే అయ్యారు. సూళ్లూరుపేట బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1970 దశకంలో తన పెదనాన్న బద్దెపూడి పేరారెడ్డి రాజకీయ వారసుడిగా స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి శిష్యరికంతో రాజకీయ రంగంలోకి వచ్చారు. సూళ్లూరుపేట పంచాయితీ సర్పంచ్‌గా, సమితి అధ్యక్షుడిగా పోటీ చేసి ఓడిపోయారు.

1975లో సూళ్లూరుపేటలో యంగ్‌మెన్ క్రియేషన్ క్లబ్‌ను స్థాపించిన ఆయన ఆ క్లబ్‌కు విశాలమైన భవనాలు కట్టించారు. ఆ క్లబ్‌కు తొలి అధ్యక్షుడిగానే కాకుండా, ఇప్పటివరకు కూడా ఛైర్మన్‌గా కొనసాగారు. 1991లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, రెండేళ్లపాటు ఆ పదవిని సమర్ధవంతంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారు. 2008 నుండి 2010 వరకు సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా పనిచేసిన ఆయన, తన హయాంలోనే దేవస్థానం స్వాగత ద్వారాలను, అతిథి గృహాలను నిర్మించడమే కాకుండా దేవస్థానంలో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

జైఆంధ్ర ఉద్యమ సమయంలో ప్రస్తుత ఉపరాష్ట్రపతి, అప్పటి జైఆంధ్ర ఉద్యమ నాయకుడైన యం.వెంకయ్యనాయుడుతో కలిసి ఆయన ఆ ఉద్యమంలో ఎంతో చురుకుగా పాల్గొన్నారు. బద్దెపూడి వేణుగోపాలరెడ్డి జీవిత పయనంలో చెప్పుకోదగ్గ మరో విశేషం ఆయన రాజకీయ పయనం కాంగ్రెస్‌పార్టీతోనే మొదలై, ఆ పార్టీలోనే ఆయన జీవితం ముగియడం. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ నామరూపాలు లేకుండా పోయినా, ఆయన మాత్రం ఆ పార్టీని వదలకుండా కొనసాగుతూ కాంగ్రెస్ వాదిగానే తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### పెనుమల్లి వెంకురెడ్డి



నెల్లూరుజిల్లా కేంద్ర మార్కెటింగ్ సహకార సంఘం మాజీడైరెక్టర్ పెనుమల్లి వెంకురెడ్డి ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున నెల్లూరులోని తన స్వగృహంలో కనుమూశారు. ఆయన వయస్సు 85 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దగదర్తి మండలం, పెదపుత్తేడు ఆయన స్వగ్రామం. గతంలో రాజకీయాల్లో చురుగ్గా వున్న ఆయన, పెదపుత్తేడు సొసైటీ ఛైర్మన్‌గాను, డిసిఎంఎస్ డైరెక్టర్‌గాను పని చేశారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## పూర్వవిద్యార్థుల సహకారంతో..
# విఆర్‌సికి పూర్వవైభవం

**- మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్**



విఆర్‌సి మైదానం ఆధునీకరణకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

పూర్వవిద్యార్థుల సహకారంతో విఆర్ విద్యాసంస్థలకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొ న్నారు. ఈనెల 5వ తేదీన విఆర్ కళాశాల మైదానం ఆధునీకరణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అనిల్ మాట్లాడుతూ విఆర్ విద్యాసంస్థల అభివృద్ధికి దేశంలోనే పేరుగాంచిన ఎస్ఆర్ఎం యూనివర్శిటీ సహకారాన్ని తీసుకుంటామన్నారు. విఆర్‌కు పూర్వ వైభవం తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో కమిటీని వేసామని, ప్రస్తుత పోటీ ప్రపం చంలో ఏఏ కోర్సులు ప్రవేశపెడితే బాగుం టుందన్నదానిపై ఈ కమిటీ అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటుందన్నారు. విఆర్ కళాశాల మైదానం అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తన ఎంపి నిధుల నుండి కోటిరూపాయలు మంజూరు చేశారని, వీటికి మరో 70లక్షలు జోడించి 1.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టా మన్నారు. ఈ కళాశాల అభివృద్ధికి ఐదు కోట్ల వరకు మంజూరు చేసేందుకు ఎంపి విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారన్నారు.

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జాయింట్‌కలెక్టర్ వినోద్‌కుమార్, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

**నెక్లెస్‌రోడ్డును పరిశీలించిన అనిల్**

నెల్లూరు చెరువుపై ఏర్పాటు చేసిన నెక్లెస్‌రోడ్డును మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ 5వ తేదీ పరిశీలించాడు. ఇక్కడ అసం పూర్తిగా వున్న పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. నెక్లెస్‌రోడ్డులో ఫుడ్‌కోర్టులు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుపై అధికారులకు సూచనలిచ్చాడు.

## ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘానికి
# కొత్త కార్యవర్గం

అమెరికాలోని ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం(టాంటెక్స్) 2020 సంవత్సరానికి ఇటీవల డాలస్‌లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కోడూరు కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఈయన నెల్లూరీ యులు కావడం విశేషం. ఈ సంస్థకు ఉత్తర అధ్యక్షురాలిగా లక్ష్మి పాలేటి, ఉపాధ్యక్షునిగా ఉమామహేష్ పార్నపల్లి, కార్యదర్శిగా సతీష్ బండారు, కోశాధి కారిగా శరత్ ఎర్రం, సంయుక్త కార్య దర్శిగా మల్లిక్ కొండా, సంయుక్త కోశాధి కారిగా కల్యాణి తాడిమేటి, తక్షణ పూర్వా ధ్యక్షులు చినసత్యం వీర్నపు అధికార కార్యనిర్వాహక సంఘంగా ఎన్నికయ్యారు. శ్రీకాంత్‌రెడ్డి జొన్నల, చంద్ర పొట్టిపాటి, రఘునాధరెడ్డి కుమ్మెత్త, స్రవంతి ఎర్రమ నేని, సరిత కొండా, ప్రభాకర్‌రెడ్డి మెట్టా, చంద్రారెడ్డి పోలీస్, వెంకట్ బొమ్మా, జనార్దన్ యెనికపాటి, లోకేష్‌నాయుడు కొణిదల, నాగరాజ్ చల్లా, ఉదయ్ నిడ గంటి, భానుప్రకాష్ వెనిగల్ల కార్యవర్గ సభ్యులుగా ఎన్నికకాగా, పవన్‌రాజ్ నెల్లుట్ల పాలకమండలి బృందం అధిపతిగా, డా.పవన్ పామదుర్తి ఉపాధిపతిగా ఎన్ని కయ్యారు. శ్రీకాంత్ పోలవరపు, వెంకట్ ములుకుట్ల, ఇందురెడ్డి మందాడి, శ్రీలక్ష్మి మండిగ, ఎన్ఎంఎస్‌రెడ్డి ఈ బృందంలో ఉన్నారు.

## కలెక్టరేట్ ఏఓగా రామారావు

నెల్లూరు కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏఓ)గా రామారావు ఈనెల1న బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ భూ విభాగంలో పనిచేస్తున్న ఆయనకు ఏఓగా పూర్తి బాధ్య తలను అప్పగించారు. గతంలో పని చేస్తున్న ఏఓ ఏడుకొండలు జనవరి 31న ఉద్యోగ విరమణ చేశారు.

## కరోనా వైరస్‌పై...
# అపోహలు సృష్టించవద్దు

**- డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి**




గూడూరు పట్ట ణంలోని తమ ఆసు పత్రిలో కరోనా వైరస్ అంటూ అపోహలు సృష్టించవద్దని, ప్రజ లను భయాందోళన లకు గురి చేయవద్దని, వైరస్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడ లని ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి కోరారు. బుధవారం డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రిలో వారు విలేకర్లతో మాట్లాడారు. తమ ఆసుపత్రిలో ముగ్గురు వ్యక్తులకు కరోనా వైరస్ వ్యాధి సోకి చికిత్స పొందుతున్నట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం మంచిపద్ధతి కాదన్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయడం తగదన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసినవారిపై గూడూరు డిఎస్పీ శ్రీ భవాని హర్షకి ఫిర్యాదు చేశామన్నారు. ప్రజలు కూడా ఇలాంటి అపోహలు నమ్మవద్దని ఆందోళన చెందవద్దని వారు సూచించారు. ఈ వ్యాధికి సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఎటువంటి ల్యాబ్‌లు లేవని, ఒక్క పూణేలో మాత్రమే ఇటువంటి సౌకర్యం ఉందని, రాష్ట్రంలో ఎక్కడా ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కాలేదన్నారు. దుష్ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని వారు కోరారు.



గూడూరు, పెల్లేటి రామిరెడ్డి క్లబ్ 125వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల మెరిట్ స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న పెలర్ క్లబ్ అధ్యక్షుడు పొణకా శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి మల్లు విజయకుమార్‌రెడ్డి మరియు క్లబ్ సభ్యులు.

# కళ్యాణ వైభవం...!




జిల్లా టీడీపీ నాయకులు, కోవూరు ఏఎంసి మాజీచైర్మెన్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి - శైలజల కుమారుడు **డా. ప్రీతమ్ - డా. శ్రీలక్ష్మి మనస్విని** (నెల్లూరు వాస్తవ్యులు దొడ్ల శ్రీకర్‌రెడ్డి - శిరీషల కుమార్తెల) కళ్యాణం జనవరి 30వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపం నందు జరిగింది. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఈ వివాహ వేడుకకు హాజరై వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.




నెల్లూరుజిల్లా వాస్తవ్యులు, హైదరాబాద్ నివాసి, భారతదేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థ సిసిఎంబి ఉద్యోగి పచ్చా రవి - స్వర్ణలతల కుమారుడు **శ్రీహర్ష - హర్షిత విష్ణుప్రియ** (తిరుపతి వాస్తవ్యులు కొణిదెల ఢిల్లీబాబు - గిరిజల కుమార్తెల పరిణయం జనవరి 27వ తేదీ తిరుచానూరులోని ఎస్ఎస్‌బి కళ్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# ఆ కిరాతకుడికి... ఉరే సరి

## • తల్లీకూతుళ్ల హత్య కేసులో సంచలన తీర్పు!

2013 ఫిబ్రవరి 12వ తేదీన నెల్లూరు నగరంలోని హరనాథపురంలో సంచలనం సృష్టించిన తల్లీకూతుర్ల హత్య కేసులో ప్రధాన నిందితుడు ఇంతియాజ్‌కు ఉరిశిక్ష విధిస్తూ.. 8వ జిల్లా అదనపు న్యాయమూర్తి సత్యనారాయణ ఈ నెల 6వ తేదీ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు మైనర్లు కావడంతో మూడేళ్ళ నుండి వాళ్ళు జైళ్లలో వుంటున్నారు. కేసు వివరాలలోకి వెళితే... నెల్లూరులోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ దినకర్‌రెడ్డి, తన భార్య శకుంతల, కుమార్తె భార్గవితో కలిసి హరనాథపురంలో నివాసముంటున్నారు. దినకర్‌రెడ్డి హరనాథపురంలో తాను కడుతున్న ఇంటికి ఇంటీరియర్ డిజైన్ విషయమై ఇంతియాజ్‌తో కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. ఇంటికి వస్తూ పోతున్న క్రమంలో ఇంతియాజ్ ఆ ఇంట్లో ఏ సమయంలో ఎవరుంటారన్న విషయాన్ని పసిగట్టాడు. ఆ ఇంట్లో వున్న నగదు, నగలను కాజేయాలని ప్లాన్ చేసుకున్నాడు. 2013 ఫిబ్రవరి 12న దినకర్‌రెడ్డి ఇంట్లో లేని సమయం చూసి ఇంటికి వచ్చాడు. ఇంతియాజ్ తెలిసి వుండడంతో ఇంట్లో వున్న దినకర్‌రెడ్డి భార్య, కూతురు కూడా అతనిని లోనికి రానిచ్చారు. అయితే అప్పటికే ఎంతో పకడ్బందీ ప్లాన్‌తో కత్తులు, రాడ్‌లతో వచ్చిన ఇంతియాజ్.. మరో ఇద్దరితో కలిసి శకుంతల, భార్గవిలపై విచక్షణా రహితంగా దాడి చేశారు. అయితే ఈ దాడి జరుగుతున్న సమయంలో ఆ చుట్టుపక్కల వారు రావడంతో నిందితులు అక్కడే పట్టుబడ్డారు. అయితే, దాడిలో గాయపడ్డ శకుంతల, భార్గవిలు మాత్రం ఆసుపత్రికి తీసుకువెళ్ళే లోపే మరణించారు. ఈ సంఘటన నగరమంతా వ్యాపించడంతో పెద్దఎత్తున ప్రజలు అక్కడ గుమికూడి నిందితులకు దేహశుద్ధి చేశారు. అంతేగాక, నిందితులను అక్కడే ఎన్‌కౌంటర్ చేయాలంటూ పెద్దఎత్తున ఆందోళనకు కూడా దిగారు. అయితే అప్పుడు సిఐగా వున్న రాంబాబు, ఎస్ఐగా వున్న రామారావులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నిందితులను అరెస్టు చేసి ఈ కేసులో సాక్ష్యాధారాలను బలంగా నిలబెట్టారు. ఇన్నేళ్ళ తర్వాత ప్రధాన నిందితుడైన ఇంతియాజ్‌కు ఉరిశిక్ష విధిస్తూ 8వ అదనపు న్యాయమూర్తి సత్యనారాయణ తీర్పు చెప్పారు. గురువారం కోర్టు వద్ద ప్రజలు పెద్దఎత్తున గుమికూడి ఆసక్తిగా తీర్పు కోసం ఎదురుచూశారు.

# ప్రభుత్వం నుండి డాక్టర్లకు మెమోలు

విధులకు సక్రమంగా హాజరుకాని నలుగురు ప్రభుత్వ డాక్టర్లకు వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వం నుండి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల, పెద్దాసుపత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌నాయుడు, సర్జన్ హరిచరణ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, అనస్థీషియా విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసవర్మలకు నోటీసులు జారీ అయ్యాయి. వాళ్ళు ఇచ్చే వివరణ బట్టి తదుపరి చర్యలుంటాయి.

# రెడ్‌క్రాస్‌కు యంగ్ బ్లడ్

## నూతన సారథిగా విద్యావేత్త చంద్రశేఖర్‌రెడ్డి



వివాదాల వలయంతో కుంభకోణాలనిలయంగా తయారయ్యి ఫ్రాడ్‌క్రాస్‌గా మారిన రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ ఇప్పుడు యువ నాయకత్వం చేతిలోకి వెళ్ళింది. ఫిబ్రవరి 3వ తేదీ ఆదివారం రాజకీయ ఎన్నికలను తలపించే రీతిలో జరిగిన రెడ్‌క్రాస్ ఎన్నికలలో ఎక్కువ శాతం యువతకి చోటు దక్కింది. పాత కమిటీలో వుంటూ అందిన మేరకు దోచుకుని మళ్ళీ కొత్తకమిటీలో దూరిన స్కాములోరు కూడా ఈ ప్యానెల్లో గెలవడం కొసమెరుపు.

కొత్తకమిటీలో సభ్యులుగా బి.మనోహర్‌రెడ్డి, బయ్యా ప్రసాద్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, తన్నీరు మాల్యాద్రి, లింగారెడ్డి వెంకటనరసారెడ్డి, కాటంగారి వెంకటేష్, దాకారపు రవిప్రకాష్, మాకేటి అంకయ్యచౌదరి, గంధం ప్రసన్నాంజనేయులు, యాలమూరి రంగయ్యనాయుడు, సురేష్‌కుమార్ జైన్, యడవల్లి సురేష్, దాసరి రాజేంద్రప్రసాద్‌లు విజయం సాధించారు.



ఇప్పుడు కొత్తగా చైర్మన్ పగ్గాలు చేపట్టిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడు. విద్యాసంస్థ సారథిగా గత దశాబ్దకాలంపైగా ఇంటర్ నుండి పీజీ వరకు కొన్నివేల మంది భావిభారత పౌరులకు శిక్షణ ఇచ్చి, నైతిక విలువలతో పాటు సామాజికసేవ తదితర అంశాలలో నేటితరానికి ఉండాల్సిన కనీస లక్షణాలపట్ల వారికి అవగాహనా కల్పించి వారి భవిష్యత్తుని తీర్చిదిద్దిన ఘనత చంద్రశేఖర్‌రెడ్డిది.

సుమారు పాతికేళ్లుగా ఒకే ఆధిపత్యంలో వున్న రెడ్‌క్రాస్ కమిటీ ఇప్పుడు యువ రక్తంతో నిండింది. కొత్త కమిటీలో ఇద్దరు తప్ప అందరూ కొత్తవారే. ఒక వైపు కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు చేస్తూనే మరోవైపు గుట్టుగా కోట్ల రూపాయలు బొక్కేస్తున్న వారి భరతం పట్టాల్సిన భాద్యత వీరిపైన ఉంది.

వ్యక్తిగత మొహమాటాలకు, స్నేహ బంధానికో లొంగకుండా నిజానిజాల నిగ్గు తేల్చాల్సిన బాధ్యత కూడా ఈ కమిటీదే. నిన్నటి వరకు పాత కమిటీ పైన విమర్శలతో దాడి చేసిన వారు ఇప్పుడు ఆ కమిటీ పాలనలో జరిగిన అవినీతిని బయట పెట్టాలి. ఈ కొత్తకమిటీ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వేలాదిమంది రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానీయకుండా పాత లెక్కలు తేల్చి కొత్త బాసలతో రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతారని ఆశిద్దాం.!

### ఓటేసి... ఫైన్ కట్టారు!

అసెంబ్లీ ఎన్నికలను తలపించే రీతిలో ఈసారి రెడ్‌క్రాస్ ఎన్నికలు జరిగాయి. సమాజానికి తమవంతు సేవలందించాలనే సంకల్పంతో కొంతమంది, పదవుల యావతో ఇంకొంతమంది మొత్తం 46మంది ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. పంచాయితీ ఎన్నికలను మరిపించేలా పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ వంటి సేవాసంస్థకు మంచి కమిటీని ఎన్నుకుందామన్న ఉద్దేశ్యంతో 4వేల మంది సభ్యులు ఓటింగ్‌కు ఉత్సాహంగా వచ్చారు. అంతా బాగానే వుంది. ఒక్కటే లోపం... అదే ఓటర్లకు చలానాల రూపంలో శాపమైంది. రెడ్‌క్రాస్ ఎన్నికలను విశాల ప్రాంగణంలో కాకుండా ఇరుకు సందులో నిర్వహించడంతో ఓట్లేయడానికి వచ్చిన సభ్యులు తమ వాహనాలను ఎక్కడంటే అక్కడ నిలిపారు. వాళ్ళు ఓట్లేసి వచ్చేలోపు ట్రాఫిక్ పోలీసులు తమ పని తాము కానిచ్చేశారు. ఫలితం... అందరికీ ట్రాఫిక్ చలానాలు... అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేసినందుకు ఫైన్‌లు కట్టమని...! సాధారణ ఎన్నికలలో జనాలు డబ్బు తీసుకుని ఓట్లకు వెళతారు, రెడ్‌క్రాస్ ఎన్నికలలో మాత్రం ఓట్లేసిన వాళ్ళే చలానాల రూపంలో డబ్బులు కట్టాల్సి వచ్చింది. కొంచెం విశాల ప్రాంగణాలలో ఈ ఎన్నికలు పెట్టుంటే, ఈ చలానాల బాధ వుండేది కాదుకదా!

# మాడరన్ ఐ హాస్పిటల్‌లో సర్జిలైవ్



'సర్జిలైవ్'ను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న డాక్టర్లు పిఎల్ రావు, భారతి

నెల్లూరు పొగతోటలో వున్న మాడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్‌లో ఈనెల 2న సర్జిలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యాధునిక సాంకేతికతను ప్రపంచ శ్రేణి మెళుకువలను వైద్యులకు, వైద్య విద్యార్థులకు పరిచయంచేసే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటిసారిగా హాస్పిటల్స్‌లో జరిగే అన్ని ఆపరేషన్లను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశం కల్పిస్తూ కేవలం ఆపరేషన్లతో కూడిన కంటిన్యూడ్ మెడికల్ ఎడ్యుకేషన్(సియంఇ) ప్రోగ్రామ్‌ను సర్జిలైవ్ పేరుతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాడరన్ ఐ హాస్పిటల్ డాక్టర్లు పియల్ రావు, భారతి, గోపాలకృష్ణ, చంద్రమోహన్, సతీష్, వినోద్ కుమార్‌రెడ్డి, రాజశేఖర్, జ్యోతి, రాజశేఖర్, అనిల్‌కుమార్‌లు, వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన డాక్టర్లు జగదీష్‌కుమార్‌రెడ్డి, శశికుమార్, సుజాత, లక్ష్మయ్యలు కాటరాక్ట్, రెటీనా, లాసిక్, స్క్వింట్, టోసిస్, టెరిజయమ్ ఆపరేషన్లను ప్రత్యక్షంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా కాటాలిస్ ఫెమ్టోసెకండ్ లేజర్ అసిస్టెడ్ ద్వారా చేసిన కాటరాక్ట్ ఆపరేషన్‌ను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఇది కంటి శుక్లం శస్త్ర చికిత్స యొక్క అత్యాధునిక పద్ధతని మాడరన్ ఐ హాస్పిటల్ డాక్టర్ పియల్ రావు తెలిపారు

• రెడ్‌క్రాస్ క్రాస్...

- రూ.7,18,15,850.50 జీతాలు, గౌరవ వేతనాల ఖర్చులు
- రూ.2,40,98,824.00 సలహాలు సంప్రదింపుల ఖర్చులు
- రూ.5,12,13,504.10 ఇతర(చిల్లర) ఖర్చులు

# ఈ కోట్ల లెక్క తేలాలి!

రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖలో 'కళ్ళు కప్పి కోట్లు దోచేస్తున్నారు' అంటూ గత వారం వచ్చిన వార్తపై లాయర్ పాఠకుల నుండి విశేష స్పందన లభిస్తోంది. చిల్లర ఖర్చులకు కోట్లు ఖర్చా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకవైపు సలహాలు సంప్రదింపులు అంటూనే మరోవైపు గౌరవ వేతనాలు అని లెక్కల్లో చూపడం పక్కా ఫ్రాడ్‌లా ఉందని తమ అభిప్రాయాలను చాలామంది 'లాయర్'తో పంచుకున్నారు. చిల్లర ఖర్చులంటే ఆఫీస్ ఖర్చులు కాబోలు అని కొంతమంది, స్టేషనరీ ఖర్చులేమో అని మరి కొంతమంది, టెలిఫోన్, కరెంటు బిల్లులేమో అని ఇంకొంతమంది ఎవరికీ వారే ఇవన్నీ ఊహించుకుని పోనీలే పాపం అని కూడా అంటున్నారు. వారు చెప్పిన పద్దుల క్రింద అన్ని లెక్కలూ చూపించిన తరువాతే ఈ చిల్లర ఖర్చుల పద్దు రాయబడిందని చాలామందికి అర్థం కావడం లేదు. అలాంటివారి కోసమే ఈ వారం రెడ్‌క్రాస్ నెల్లూరుశాఖ 3సంవత్సరాల పద్దుని(వారు సమర్పించి ఆడిటర్ల చేత సర్టిఫై చేయించినవి) మళ్ళీ వివరంగా అందిస్తున్నాము.

ఈ సలహాలు సంప్రదింపుల ఖర్చు, గౌరవ వేతనాల ఖర్చు, ఇతర(చిల్లర) ఖర్చుల పద్దు లెక్క తేలాల్సిందే. జిల్లా కలెక్టర్ మరియు రెడ్‌క్రాస్ కొత్త కమిటీ ఈ బాధ్యత తీసుకోవాలి. సమాచార హక్కు చట్టం పరిధిలోకి తాము రామంటూ తప్పించుకునే ప్రయత్నం చెయ్యడం సరికాదు. రెడ్‌క్రాస్ జీవిత సభ్యులైనా లేదా ఏ ఇతర బాధ్యత కలిగిన పౌరుడు అడిగినా సమాచారం ఇచ్చి తీరాల్సిందే. సమాచారం కోసం వేచిచూద్దాం!

**2016-17, 2017-18, 2018-19 సంవత్సరాలకు రెడ్‌క్రాస్ సమర్పించిన వార్షిక లెక్కల పట్టిక ఒకసారి గమనిస్తే... ఇక్కడ ఏ స్థాయిలో అవినీతి, దోపిడీ జరుగుతోందో అర్థం అవుతుంది.**

| పద్దుల వివరాలు | 2016 - 2017 | 2017 - 2018 | 2018 - 2019 | మొత్తం |
|---|---|---|---|---|
| బ్లడ్‌బ్యాంక్ మెయింటెనెన్స్ | 70,50,072.50 | 1,29,53,052.00 | 1,14,05,615.00 | 3,14,08,739.50 |
| భవనాల నిర్వహణ | 72,499.00 | 0.00 | 18,855.00 | 91,354.00 |
| యంత్రాల నిర్వహణ | 31,27,268.40 | 5,99,703.00 | 2,10,519.08 | 39,37,490.48 |
| ఆఫీస్ ఖర్చులు | 6,66,691.00 | 62,77,207.50 | 67,52,597.50 | 1,36,96,496.00 |
| జీతాలు, గౌరవ వేతనాలు | 2,01,35,196.50 | 2,32,25,206.00 | 2,84,55,448.00 | 7,18,15,850.50 |
| వాహనాల నిర్వహణ | 8,58,488.00 | 4,93,770.00 | 4,57,915.00 | 18,10,173.00 |
| స్టేషనరీ | 9,59,459.00 | 13,83,325.00 | 15,94,482.00 | 39,37,266.00 |
| సిబ్బంది సంక్షేమం | 2,67,268.00 | 1,81,453.00 | 82,803.00 | 5,31,524.00 |
| టెలిఫోన్ ఛార్జీలు | 1,68,671.50 | 1,55,638.00 | 86,278.00 | 4,10,587.50 |
| కరెంటు ఛార్జీలు | 28,86,348.00 | 31,72,413.00 | 32,13,367.80 | 92,72,128.80 |
| కన్సెల్టెన్సీ ఛార్జీలు | 61,56,618.00 | 85,16,985.00 | 94,25,221.00 | 2,40,98,824.00 |
| డొనేషన్లు | 9,000.00 | 8,418.00 | 1,25,000.00 | 1,42,418.00 |
| ప్రకటనలు | 35,835.00 | 4,054.00 | 6,672.00 | 46,561.00 |
| ప్రయాణ ఖర్చులు | 1,66,251.00 | 1,98,769.00 | 2,47,456.00 | 6,12,476.00 |
| ఇతర ఖర్చులు | 1,67,90,294.60 | 1,72,71,479.95 | 1,71,51,729.55 | 5,12,13,504.10 |



# ఫ్యాను గూటికి భాను..

- ఈ నెల 10న ముహూర్తం



**రాజకీయాలలో శాశ్వత శత్రువులుండరు, శాశ్వత మిత్రులుండరు అన్నది అందరికీ తెలుసుగాని, బద్ధశత్రువులనేవాళ్ళు కూడా వుండరని ఇప్పుడు తెలుస్తోంది. అసలు ఒకే పార్టీలో, ఒకే వేదికపై ఊహించడానికి కూడా కష్టసాధ్యమైన సన్నివేశాన్ని త్వరలోనే మనం నెల్లూరు రాజకీయ తెరపై చూడబోతున్నాం.**

నెల్లూరు జిల్లా రాజకీయాలలో మహిళల గురించి చెప్పుకోవాల్సి వస్తే పనబాక లక్ష్మి, మాగుంట పార్వతమ్మ, నేదురుమల్లి రాజ్యలక్ష్మి వంటి వాళ్ళు గుర్తుకొస్తారు. నెల్లూరు నగర రాజకీయాలలో మహిళా నాయకురాళ్ళుగా చెప్పుకోవాలంటే గుర్తుకొచ్చే మొదటి పేరు శ్రీమతి నందిమండలం భానుశ్రీ. రెండుసార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి కార్పొరేటర్‌గా గెలవడమే కాదు, నెల్లూరు నగరపాలక సంస్థకు రెండో మేయర్‌గా కూడా పని చేసిన బి.సి వర్గాలకు చెందిన మహిళా నాయకురాలు.

1995లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆమె తొలిసారి కౌన్సిలర్‌గా గెలుపొందారు. అనతికాలంలోనే చురుకైన నాయకురాలిగా, వార్డులో ప్రజలకు పనిచేసే మనిషిగా పేరు తెచ్చుకున్నారు. అప్పటి మున్సిపల్ ఛైర్మెన్‌గా వున్న స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డికి అత్యంత నమ్మకస్తురాలయ్యారు. ఆమెలోని పనిచేసే తత్వం, చురుకుదనం గుర్తించిన వివేకానందరెడ్డి రాజకీయంగా ఆమెను ప్రోత్సహించారు. 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలోనూ ఆమె రెండోసారి కౌన్సిలర్‌గా గెలిచారు.

2005లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో ఆమె కార్పొరేటర్‌గా గెలవడమేకాక మేయర్ రేస్‌లో నిలిచారు. అయితే ఆరోజు సామాజిక సమీకరణల మూలంగా ఆమెకు కుర్చీ దక్కకపోయినప్పటికీ, 2008లో ఆనం వివేకానందరెడ్డి పట్టుబట్టి మేయర్ కుర్చీ నుండి పులిమి శైలజను దించి, భానుశ్రీని మేయర్‌ను చేయగలిగాడు. అప్పట్లో పులిమి శైలజను దించి భానుశ్రీని మేయర్‌ను చేయడంలో ఇప్పటి నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కూడా ప్రధాన పాత్ర పోషించాడు.

అయితే 2009 ఎన్నికల తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఆ ఎన్నికల్లో నెల్లూరు నగర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ప్రస్తుత మంత్రి పి.అనిల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డిలు ఒక జట్టుగా ఏర్పడి ఆనంపై యుద్ధం ప్రకటించడం, ఇరు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో పోరు నడవడం తెలిసిందే! వైయస్ మరణానంతరం ఈ పోరు తీవ్రరూపం దాల్చడం, ఇరువర్గాల పోరాటంలో ఏసిబి దాడుల ద్వారా భానుశ్రీ కుటుంబం కొంత ఇబ్బంది పడడం జరిగింది.

2014 ఎన్నికల తర్వాత భానుశ్రీ నెల్లూరు నగర రాజకీయాలకు దూరంగా వుంటూ వస్తోంది. ఈ రాజకీయాలే నాకొద్దనుకుంది. అయితే ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో భానుశ్రీ గత వైరాన్ని మరచి, వైసిపిలో చేరడానికి సిద్ధమైంది. గతంలో ఆమె ఎవరినైతే రాజకీయ శత్రువులుగా చూసిందో, వారి సమక్షంలోనే ఈ నెల 10న వైసిపిలో చేరడానికి రంగం సిద్ధమైంది.

కాబట్టి రాజకీయాలలో శత్రుత్వాలు, స్నేహాలు శాశ్వతం కాదన్నది ప్రతిఒక్కరూ మరోసారి తెలుసుకోవాలి!

## ఎన్‌బీకేఆర్‌లో...

# జపాన్ సంస్థ శిక్షణ



నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఈనెల 5న జపాన్‌కు చెందిన ఫ్రైమ్ మేడిన్ సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. జపాన్‌కు చెందిన ఫ్రేమ్ మేడిన్ సంస్థతో నైపుణ్య బదలాయింపుపై ఎన్‌బీకేఆర్ ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ నాట్సగు వవ్వాయ్, మేనేజర్ చాయ్ చువాకుల్ సేఫ్టీ అండ్ బాడ్లీ సెన్సేషన్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఎలక్ట్రిక్ ట్రాన్స్ ఫార్మర్ తయారీలో అధునాతన పద్ధతులు తెలియజేశారు. నైపుణ్యం, ప్రతిభ ఉన్న విద్యార్థుల వైపే బహుళ జాతి కంపెనీలు దృష్టి సారిస్తున్నాయన్నారు. పరిశ్రమలు కోరుకున్న విధంగా రాణించాలన్నారు. రెండురోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ మజహర్ హుస్సేన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com